http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

పేజీలు : 5 వెల : 5/-

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




# సంక్షేమానికే పెద్దపీట

## పేదలు, యువత, అన్నదాతలే టార్గెట్

## రూ. 50,65,345 కోట్లలో కేంద్ర బడ్జెట్

పేదలు, యువత, రైతులు, మహిళల పురోభివద్ధే లక్ష్యంగా కేంద్రం 2025-26 బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచింది. వికసిత్ భారత్ దిశగా సంస్కరణలు కొనసాగిస్తామని చెబుతూనే సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఎవరూ ఊహించని విధంగా చరిత్రలో తొలిసారి వేతన జీవులకు 12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపులు కల్పించింది. మొత్తం రూ.50,65,345 కోట్లతో నూతన బడ్జెట్‌ను ప్రతిపాదించింది.



“

### మధ్యతరగతి వర్గానికి భారీ ఊరటనిస్తుంది

కేంద్ర బడ్జెట్‌లో 12 లక్షల రూపాయల్లోపు వార్షిక ఆదాయస్తులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతి వర్గానికి భారీ ఊరటనిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2025–26ఆర్థిక సంవత్సరం కోసం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్, ప్రజల బడ్జెట్, సంస్కరణల బడ్జెట్ అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రతీ భారతీయుడి కలలను నెరవేర్చే ఈ పద్దు.. 140 కోట్లమంది ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందన్నారు. ప్రతీసారి బడ్జెట్ ప్రభుత్వ కోషాగారాన్ని నింపడంపై దృష్టిసారిస్తే.. ఈసారి పద్దు మాత్రం ప్రజల జేబులను నింపడానికి, తద్వారా వారి పొదుపును పెంచడానికి ఉద్దేశించిందని మోదీ వివరించారు.

- ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు గుడ్‌న్యూస్
- కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు పన్ను సున్నా
- వృద్ధులకు వడ్డీపై టీసీఎస్ ఊరట
- 36 ఔషధాలకు బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తొలగింపు
- బీమా రంగంలో ఎఫ్‌డీఐ 100 శాతానికి పెంపు
- వచ్చే వారం ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు
- గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా
- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు
- వ్యవసాయ రంగానికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నాం
- విత్తనం నుంచి మార్కెట్ వరకు అన్నిరకాల మార్పులకు శ్రీకారం చుట్టాం
- పెట్టుబడిసాయం, రుణాలు, కొత్త వంగడాల సృష్టి.. ఇలా అనేక రకాలుగా రైతుకు మద్దతు ఇస్తున్నాం
- చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని మరింత మెరుగుపరిచాం

2



### బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్టుంది

- ప్రస్తుతం ప్రపంచమంతా అస్థిరత నెలకొని ఉంది
- ఇలాంటి సమయంలో దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్నది
- కానీ ప్రభుత్వం దివాళా కోరు ఆలోచనలు చేస్తున్నది
- కేంద్ర బడ్జెట్‌పై రాహుల్‌గాంధీ విమర్శ

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంకు అన్యాయం

- కమాండ్ కంట్రోల్ రూంలో రేవంత్ రెడ్డి కీలక భేటీ
- భేటీలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఆర్థిక శాఖ అధికారులు
- కేంద్ర ప్రభుత్వాన్ని అడిగిందేమిటి? ఇచ్చిందేమిటంటూ ముఖ్యమంత్రి అసంతృప్తి
- బడ్జెట్‌పై శ్రీధర్ బాబు అసహనం



హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మేం ఏం అడిగాం... మీరు ఇచ్చింది ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని పేర్కొంటూ, ఈ అంశంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఆర్థిక శాఖ అధికారులు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. రాష్ట్రంలో అనుసరించాల్సిన ఆర్థికపరమైన విధానాలు, పథకాల - మిగతా3లో

# దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్

- పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్
- రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకం
- తెలంగాణసహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదా
- ఇది సంక్షేమ బడ్జెట్–ప్రజల పెన్నిధి నరేంద్రమోదీ
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



న్యూఢిల్లీ

కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉంది. పేద, మధ్యతరగతి, రైతులు, చిరు వ్యాపారుల, యువ పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన బడ్జెట్ ఇదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.. మధ్యతరగతి ఉద్యోగుల, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఓ వరం. ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక చర్య. గత 75 ఏళ్లలో మధ్య తరగతి ప్రజల కోసం ఇంత అనుకూలమైన బడ్జెట్ ఎన్నడూ రాలేదు. అట్లాగే ఇది సంస్కరణల బడ్జెట్. 2027నాటికి అమెరికా, చైనా తరువాత భారత్ ను మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే ఆ - మిగతా3లో



### అందర్నీ కలుపుకొని వెళ్లే బడ్జెట్

- నిర్మలమ్మపై కేంద్ర మంత్రులు, సీఎంల ప్రశంస
- మోదీ ప్రభుత్వ విజన్‌కు బ్లూప్రింట్: అమిత్‌షా
- స్వయంసమృద్ధి భారత్‌కు చేయూత: శివరాజ్
- ఇన్నొవేషన్, ఇన్‌క్లూజన్: గడ్కరీ
- అభివృద్ధి భారత్ దిశగా: రాజ్‌నాథ్ సింగ్

# కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికనే లేదు

- కేసీఆర్ అంటే హిస్టరీ.. రేవంత్ అంటే లాటరీ.. : కేటీఆర్
- ఆఖరికి సఫాయి సిబ్బందికి కూడా పైసలు పడట్లేదు
- రేవంత్ రెడ్డికి తిట్ల పురాణం తప్ప ఏం రాదు
- అంబేద్కర్ ఒక వర్గానికో, ఒక కులానికో సంబంధించిన వ్యక్తి కాదు



వికారాబాద్

కేసీఆర్ అంటే హిస్టరీ.. రేవంత్ అంటే లాటరీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. టికెట్ కొనకుండా లాటరీ గెలిచినోడు రేవంత్ రెడ్డి. తప్పిదారి అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయిండు.. ఇక ఆగుతలేడు అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. పరిగి నియోజకవర్గంలోని దాస్యా నాయక్ తండాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. మా భూములు మాకే కావాలని ఇవాళ లగచర్లలో గిరిజన రైతులు కొట్లాడుతున్నాం అంటే - మిగతా3లో

### మళ్లీ భారీగా ఎన్‌కౌంటర్

- 8 మంది మావోయిస్టులు హతం
- ఈ సంఖ్య మరింత పెరిగవచ్చని భద్రతా దళాలు స్పష్టం
- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ప్రత్యేక కార్యాచరణ



# దేశమంటే కొన్ని రాష్ట్రాలేనా..



- కేంద్ర బడ్జెట్‌పై ఆర్థిక శాఖ మాజీమంత్రి హరీష్ రావు
- 2025–26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప
- దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదు
- కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా అని పునర్ సమీక్షించుకోవాలని కోరుతున్నా

హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌పై ఆర్థిక శాఖ మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 2025–26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లెవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా అని పునర్ సమీక్షించుకోవాలని కోరుతున్నామని అన్నారు. - మిగతా3లో

# సంక్షేమానికే పెద్దపీట

**న్యూఢిల్లీ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ మొత్తంగా రూ. 50,65,345 కోట్ల కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రెవెన్యూ వసూళ్లను రూ. 34,20,409 కోట్లుగా అంచనా వేశారు. మూలధన వసూళ్లలో రూ. 16,44,936 కోట్లుగా ఉండబోతున్నట్లు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో అత్యధికంగా రక్షణ రంగానికి నిధులు కేటాయించారు. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయించారు. శాస్త్ర, సాంకేతిక రంగానికి రూ. 55 వేల కోట్లు కేటాయించినట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఇది 8వ సారి. తద్వారా ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మహిళా మంత్రిగా అరుదైన ఘనత సాధించారు. 'ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి చర్యలు పది విస్తృత రంగాల్లో ఉన్నాయి. పేదలు, యువత, అన్నదాత, మహిళలపై దృష్టిపెట్టినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. 'వ్యవసాయ అభివృద్ధి, దిగుబడి పెంపు, గ్రామాల్లో నిర్మాణాత్మక అభివృద్ధి, సమగ్రాభివృద్ధి పథంలోకి అందరినీ కలుపుకుని వెళ్లడం, మేకిన్ ఇండియాలో భాగంగా ఉత్పత్తి పెంపు, ఎమ్ఎస్ఎమ్ఇలకు మద్దతు, ఉద్యోగాలు కల్పించే అభివృద్ధి, ప్రజా ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణల రంగంలో పెట్టుబడులు, ఇంధన సరఫరా పరిరక్షణ, ఎగుమతులకు ప్రోత్సాహం, ఆవిష్కరణలు పెంచి పోషించడం ఇందులో భాగం. ఈ అభివృద్ధి యాత్రలో వ్యవసాయం, ఎమ్ఎస్ఎమ్ఈ, పెట్టుబడులు, ఎగుమతులు మన శక్తివంతమైన ఇంజన్లు' అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

**బడ్జెట్ 2025 సమగ్ర స్వరూపం**

రెవెన్యూ వసూళ్లు రూ. 34,20,409 కోట్లు
పన్ను వసూళ్లు రూ. 28,37,409 కోట్లు
పన్నేతర వసూళ్లు రూ. 5,83,000 కోట్లు
మూలధనం వసూళ్లు రూ. 16,44,936 కోట్లు
రుణాల రికవరీ రూ. 29 వేల కోట్లు
ఇతర వసూళ్లు రూ. 47 వేల కోట్లు
అప్పులు, ఇతర వసూళ్లు రూ. 15,68,936 కోట్లు




మొత్తం ఆదాయం రూ. 50,65,345 కోట్లు
మొత్తం వ్యయం రూ. 50,65,345 కోట్లు
రెవెన్యూ ఖాతా రూ. 39,44,255 కోట్లు
వడ్డీ చెల్లింపులు రూ. 12,76,338 కోట్లు
మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు రూ. 4,27,192 కోట్లు
మూలధన ఖాతా రూ. 11,21,090 కోట్లు
వాస్తవ మూలధన వ్యయం రూ. 15,48,282 కోట్లు
రెవెన్యూ లోటు రూ. 5,23,846 కోట్లు
నికర రెవెన్యూ లోటు రూ. 96,654 కోట్లు
ద్రవ్య లోటు రూ. 15,68,936 కోట్లు
ప్రాథమిక లోటు రూ. 2,92,598 కోట్లు

**బడ్జెట్ కేటాయింపులు ఇలా..**

రక్షణ రంగం %-% రూ. 4,91,732 కోట్లు
గ్రామీణాభివృద్ధి %-% రూ. 2,66,817 కోట్లు
హోం శాఖ %-% రూ. 2,33,211 కోట్లు
వ్యవసాయ, అనుబంధ రంగాలు %-% రూ. 1,71,437 కోట్లు
విద్యారంగం %-% రూ. 1,28,650 కోట్లు
ఆరోగ్య రంగం %-% రూ. 98,311 కోట్లు
పట్టణాభివృద్ధి రూ. 96,777 కోట్లు
ఐటీ, టెలికాం %-% రూ. 95,298 కోట్లు
ఇంధన రంగం %-% రూ. 81,174 కోట్లు
వాణిజ్యం, పారిశ్రామిక రంగాలు %-% రూ. 65,553 కోట్లు
సామాజిక, సంక్షేమ రంగం %-% రూ. 60,052 కోట్లు
శాస్త్ర, సాంకేతిక రంగం %-% రూ. 55,679 కోట్లు

# అందర్నీ కలుపుకొని వెళ్లే బడ్జెట్

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ 2025పై పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు ప్రశంసలు కురిపించారు. ఇది విజనరీ బడ్జెట్ అని, అందర్నీ కలుపుకొని వెళ్లే బడ్జెట్ అని అభివర్ణించారు. వరుసగా ఎనిమిదో సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు అభినందనలు తెలిపారు.

**మోదీ ప్రభుత్వ విజన్‌కు బ్లూప్రింట్: అమిత్‌షా**

కేంద్ర బడ్జెట్‌పై అమిత్‌షా సోషల్ మీడియాలో ప్రధానమంత్రి మోదీ, ఆర్థిక మంత్రిని అభినందించారు. "ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందుతున్న, బెస్ట్ ఇండియా నిర్మాణం దిశగా మోదీ ప్రభుత్వ విజన్‌కు బడ్జెట్ 2025 ఒక బ్లూప్రింట్. రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, బాలల విద్య, న్యూట్రీషియన్ అండ్ హెల్త్ నుంచి స్టార్టప్, ఇన్నొవేషన్ వరకూ ప్రతి రంగంపైన బడ్జెట్‌లో దృష్టి సారించారు" అని అమిత్‌షా అన్నారు. మధ్యతరగతి వర్గం ఎప్పుడూ మోదీ హృదయంలో ఉంటారని, 12 లక్షల ఆదాయం వరకూ జీరో టాక్స్ వల్ల మధ్యతరగతి వర్గానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, లబ్దిదారులందరికీ ఈ సందర్భంగా అభినందలు తెలుపుతున్నానని అన్నారు.

**స్వయంసమృద్ధి భారత్‌కు చేయూత: శివరాజ్**

బీజేపీ 3.0 బడ్జెట్‌పై శివరాజ్ సింగ్ చౌహాన్ సంతోషం వ్యక్తం చేశారు. "స్వయం సమృద్ధి భారత్ నిర్మాణానికి ఈ బడ్జెట్ దోహదపడుతుంది. అభివృద్ధి భారత్ నిర్మాణాన్ని సాధించడానికి అవసరమైన పట్టుదల, గట్టి నమ్మకం బడ్జెట్‌లో కనిపించింది. బడ్జెట్‌లో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. మధ్యతరగతి వర్గానికి భారీ గిఫ్ట్ ఇచ్చారు. ఆదాయం పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచుతారని ఏ ఒక్కరూ ఊహించలేదు" అని అన్నారు. అన్నిరంగాల అభివృద్ధిపై బడ్జెట్ దృష్టి సారించిందన్నారు. ప్రజాసంక్షేమం,



మానవతా దృక్పథంతో బడ్జెట్ రూపొందించినందుకు ప్రధాన మంత్రి మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు.

ఇన్నొవేషన్, ఇన్‌క్లూజన్: గడ్కరి

ఇన్నొవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ సహా సంస్కరణలు, యువనాయకత్వం, కమ్యూనిటీ పార్టిసిపేషన్, మహిళా సాధికారత, కేంద్ర రాష్ట్ర సమన్వయంతో అభివృద్ధికి బడ్జెట్ పట్టం కట్టిందని నితిన్ గడ్కరి అభినందించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, డిజిటల్ విస్తరమ, మౌలిక సదుపాయలతో సంపద వృద్ధి పెరుగుతుందన్నారు.

**అభివృద్ధి భారత్ దిశగా: రాజ్‌నాథ్ సింగ్**


అభివృద్ధి భారత్ దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలల సాకరం దిశగా రూపొందించిన అద్భుతమైన బడ్జెట్ ఇదని రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. యువత, పేదలు, రైతులు, మహిళలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి బడ్జెట్ దోహదపడుతుందన్నారు. కాగా, బీజేపీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని పేదలు, యువకులు, రైతులకు లబ్ధి చేకూర్చడమే కాకుండా, మహిళా సాధికారణ, యువతకు ఉద్యోగావకాశాలు కల్పనకు దోపదపడుతుందని హర్యానా సీఎం నయబ్ సింగ్ సైనీ అన్నారు.కిసాన్ క్రెడిట్ కార్డ్ పరిమితి రూ.5 లక్షలకు పెంచడం వల్ల తమ (హర్యానా) రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

కాగా, ఇది గొప్ప బడ్జెట్ అని, ముఖ్యంగా మధ్యతరగతి వారికి ఎంతో ప్రయోజనం చేకూరే బడ్జెట్‌అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రశంసించారు. రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపు భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మైలురాయని అన్నారు. వ్యవసహాయం రంగంలోనూ పలు స్కీమ్‌లు ప్రవేశపెట్టారని, ఇది పాథ్‌బ్రేకింగ్ బడ్జెట్ అని కొనియాడారు.

# తాజా బడ్జెట్‌లో మాల్దీవులకు పెరిగిన కేటాయింపులు

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో భారత్ మాల్దీవులకు అందించే ఆర్థిక సాయాన్ని భారీగా పెంచింది. గతంలో పోలిస్తే ఈసారి మాల్దీవులకు అభివృద్ధి కోసం అందించే ఆర్థిక సాయాన్ని మోదీ ప్రభుత్వం ఏకంగా 28 శాతం మేర పెంచింది. గతేడాది ఇరు దేశాల మధ్య తీవ్ర దౌత్య ఉద్రిక్తతలు పొడచూపిన నేపథ్యంలో తాజా కేటాయింపులు ఆసక్తికరంగా మారాయి. ఉద్రికత్తల నడమ భారత్ అప్పట్లో మాల్దీవులకు అందించే నిధుల్లో కోత విధించింది. తదనంతరం, పరిస్థితులు సర్దుమణిగాయనేందుకు సూచనగా మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు మోదీ ప్రమాణస్వీకారానికి కూడా హాజరయ్యారు. దీనికి బలం చేకూర్చేలా భారత్ మార్లదీవులకు ఇచ్చే ఆర్థికసాయాన్ని మునుపెన్నడూ చూడని స్థాయిలో పెంచింది

బడ్జెట్ వివరాల ప్రకారం, ఈమారు మాల్దీవుల అభివృద్ధి కోసం ప్రభుత్వం 600 కోట్లు కేటాయించింది. ఇక గతేడాది



మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం కేవలం 470 కోట్లే కేటాయించింది. ఇక ఎన్నికల నాటి మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించడం గమనార్హం. ప్రధాని మోదీ లక్షద్వీప సందర్శన తరువాత మాల్దీవులు అవాకులు చవాకులు పేలిన విషయం తెలిసిందే. తమ పర్యాటకులను భారత్ తన వైపు ఆకర్షించే క్రమంలో తీసుకున్న చర్య మోదీ పర్యటన అని భావించిన మాల్దీవుల నాయకులు అనవసర వ్యాఖ్యలు చేసి దౌత్య వివాదాన్ని రేకెత్తించారు. ఆ తరువాత ఇండియా వ్యతిరేక ప్రచారంతో గద్దెనెక్కిన ముయిజ్జు క్రమంగా భారత్‌తో సఖ్యత పెంచుకున్నారు.

ఇక పొరుగు దేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన మోదీ ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో భూటాన్‌కు అత్యధికంగా రూ.2150 కోట్ల నిధులను కేటాయించింది. నేపాల్‌కు రూ.700 కోట్లు కేటాయించింది. ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్న మాల్దీవులకు రూ.600 కోట్లు, మారిషస్‌కు రూ.500 కోట్లు ప్రకటించారు.

## ఈ బడ్జెట్‌లో ప్రజా సమస్యల కంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యం : మాయావతి



ఇవాళ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఎస్పీ అధ్యక్షురాలు మాయవతి విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్‌లో ప్రజా సమస్యల కంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ఈ మేరకు మాయవతి తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. దేశం అధిక జనాభా, ద్రవ్యోల్బణం, పేదరికం, నిరుద్యోగం రోడ్లు, తాగునీరు , విద్య , వైద్యం లాంటి కనీస సదుపాయాల కొరత తదితర సమస్యలను ఎదుర్కొంటున్నదని, కేంద్ర బడ్జెట్‌లో ఇవేవీ ప్రస్తావనకు రాకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఏండ్ల కొద్ది కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన విధానాన్నే ఇప్పుడు బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తూ వస్తున్నాయని మాయావతి మండిపడ్డారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తే సామాన్య ప్రజలకు మేలు జరగదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాలు చూసుకుంటే ప్రజా సమస్యలకు పరిష్కారం లభించదని వ్యాఖ్యానించారు. బీజేపీ 'డెవలప్డ్ ఇండియా' విజన్‌లో బహుజనులను కూడా కలుపుకుపోవాలని ఆమె చురకవేశారు.

## మళ్లీ భారీగా ఎన్‌కౌంటర్



**రాయ్‌పూర్, ఫిబ్రవరి 01:** ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకొంది. బీజాపూర్ జిల్లాలోని గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు హతమయ్యారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భద్రతా దళాలు వెల్లడించాయి. మరోవైపు మావోయిస్టుల కోసం భద్రతా దళాలు చేపట్టిన కూబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. గంగలూరు పోలీస్ స్టేషన్ పరధిలో మావోయిస్టులు సమావేశమయ్యారంటూ భద్రతా దళాలకు శనివారం ఉదయం సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతానికి చేరుకొన్న భద్రత దళాలు కూంబింగ్ చేపట్టాయి. ఆ క్రమంలో వారికి మావోయిస్టులు ఎదురు పడ్డారు. దీంతో వారు.. భద్రతా దళాలపై కాల్పులకు తెగబడ్డారు. ఆ వెంటనే భద్రతా దళాలు స్పందించి.. ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరువైపులా హెూరా హెూరీ కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ సంఖ్య మరింత పెరిగవచ్చని భద్రతా దళాలు స్పష్టం చేస్తున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికే పలు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. ఆ యా ఎన్‌కౌంటర్లలో భారీగా మావోయిస్టులు మరణించిన విషయం విధితమే. 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామంటూ కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టమైన ప్రకటన చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే దాదాపుగా మావోయిస్టులు తుడుచు పెట్టుకు పోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మాత్రం వారి జాడ ఇంకా ఉంది. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. అందులోభాగంగా మావోయిస్టులు లొంగి పోయి జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపు నిచ్చిన సంగతి తెలిసిందే.

ఇక కేంద్రం హెూం శాఖ మంత్రి అమిత్ షా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజులు పర్యటించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీస్ స్టేషన్‌లో సీఎం దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో పలువురు మావోయిస్టులు లొంగిపోయారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు చలపతి మరణించారు. ఆయనపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తున్నాయి. అందులోభాగంగా తరచూ ఎన్‌కౌంటర్లు చోటు చేసుకొంటున్నాయి.

## బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్టుంది



పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్-2025 పై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ స్పందించారు. ఈ బడ్జెట్ 'బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ వేసినట్టుగా ఉంది అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రపంచమంతా అస్థిరత నెలకొని ఉందని, ఇలాంటి సమయంలో దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్నదని, కానీ ప్రభుత్వం దివాళా కోరు ఆలోచనలు చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. బడ్జెట్‌లోని సానుకూల అంశాలు, లోపాల ప్రస్తావన ఎత్తకుండా రాహుల్‌గాంధీ నేరుగా 'బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ లా బడ్జెట్ ఉంది' అని వ్యాఖ్యానించారు. అయితే మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ మాత్రం బడ్జెట్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ బడ్జెట్‌ను దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల బడ్జెట్‌గా అభివర్ణించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఒక వీడియో ప్రసంగాన్ని విడుదల చేశారు.

## అదుపుతప్పి కాలువలో పడ్డ వాహనం.. ఏడుగురు దుర్మరణం

వివాహ వేడుకకు వెళ్లిన 14 మందితో తిరిగివస్తున్న వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. హర్యానా రాష్ట్రం లోని ఫతేహాబాద్ జిల్లా లో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి హర్యానాకు చెందిన 14 మంది పంజాబ్‌లో ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వస్థలానికి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ముగ్గురిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మరణించారు. మిగతా ఇద్దరికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు వెల్లడించారు. శనివారం ఉదయం మరో ఆరు మృతదేహాలను వెలికితీశారు. ఇంకో ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో ఓ ఏడాదిన్నర పసిబిడ్డ, పదేళ్ల బాలిక ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్

-మొదటిపేజీ తరువాయి

దిశగానే ఈ బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయం. ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీగారి ఆధ్వర్యంలో ఇంత గొప్ప బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల పక్షపాతి అనడానికి నిదర్శనమిది. తెలంగాణసహా దేశంలో లక్ష రూపాయల లోపు జీతభత్యాలు పొందే ఉద్యోగులంతా ఇకపై పన్ను కట్టాల్సిన అవసరం లేకపోవడం గొప్ప విషయం. తద్వారా ఒక్కో ఉద్యోగికి సగటున రూ.80 వేలు ఆదా అయ్యే అవకాశముంది. పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే టీవీ, మొబైల్స్, లెదర్ ఉత్పత్తుల ధరలను భారీగా తగ్గబోతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలపై ధరలు కూడా తగ్గబోతున్నాయి. తద్వారా కాలుష్యం తగ్గే అవకాశముంది. కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు వాడుతున్న ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని భారీగా తగ్గించడంవల్ల ఆయా రోగాలకు చికిత్స వ్యయం చాలా వరకు తగ్గే అవకాశముంది. ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడంతోపాటు వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలను బ్యాలెన్స్ చేసే బడ్జెట్ ఇది.

ఈ బడ్జెట్ రైతులకు వరం. 7.7 కోట్ల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పేరిట రుణాలివ్వడమే లక్ష్యంగా పెట్టుకోవడం గొప్ప విషయం. తెలంగాణలోని దాదాపు 50 లక్షల మంది రైతులకు రూ.5 లక్షల వరకు బ్యాంకుల ద్వారా క్రెడిట్(రుణం) లభించే అవకాశముంది. ప్రైవేట్



వ్యాపారస్తుల, దళారుల వద్ద చేయిచాపే దుస్థితి లేకుండా చేసేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టారు. తక్షణమే తెలంగాణలోని రైతన్నలంతా ఈ కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు కోసం దరఖాస్తు చేసుకుని లబ్ది పొందాలని కోరుతున్నా.

వివిధ రకాల పంట ఉత్పత్తులను పెంచి రైతులను అధిక ఆదాయం తెచ్చేలా చేసేందుకు నూతనగా 'ధన ధాన్య క్రుషి యోజన పథకం'ను ప్రవేశపెట్టడం హర్షణీయం. పప్పు దినసుల కోసం ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతోపాటు జాతీయ పత్తి కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో తెలంగాణలో పత్తి, పప్పు దినుసులు పండిస్తున్న రైతులకు అధిక ప్రయోజనాలు కలిగే అవకాశం రావడంతోపాటు గిట్టుబాటు ధర పెరిగే అవకాశముంది.

ఉపాధి అవకాశాలను పెంచి యువతను వ్యాపార, పారిశ్రామికవేత్తలను చేసేందుకు బడ్జెట్ లో వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు రుణ పరిమితిని పెంచడం ఆహ్వానించదగ్గర పరిణామం. ఎంస్ఎంఈ రుణాలను రూ.5 కోట్ల నుండి రూ.10 కోట్లకు పెంచడంతోపాటు స్టార్టప్ లకు రూ.20 కోట్ల వరకు రుణాలిస్తామని బడ్జెట్లో పేర్కొనడం ద్వారా యువతకు ఎంతో ప్రయోజనం కలగబోతోంది.

విద్యుత్ రంగంలో పెను మార్పులు తీసుకొచ్చి ప్రజలకు చౌక ధరకే కరెంట్ ను అందుబాటులోకి తెచ్చే విధంగా బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయం. గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలను బడ్జెట్ లో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ గారు పట్టణాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ లో కేటాయింపులు చేయడం సంతోషంగా ఉంది. పట్టణాభివృద్ధికి నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న క్రుషిలో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని కోరుతున్నా... మొత్తంగా నిర్మలా సీతారామన్ గారు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ (2025-26) దేశ గతిని మర్చబోతుంది. దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్నట్లుగా... ఈ దేశంలోని 90 శాతం పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను, అభివృద్ధిని కాంక్షిస్తూ రూపొందించిన బడ్జెట్ చరిత్రలో నిలిపోతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదని అన్నారు.

# కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికనే లేదు

-మొదటిపేజీ తరువాయి

మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు. రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయి. ఇంకో నాలుగేండ్లకు ఎన్నికలు వచ్చినప్పుడు మీ దయ ఎవరికి ఉంటే వాళ్లు గెలుస్తారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు కామన్. ఇవాళ రాష్ట్రం ఏర్పడ్డాక 10 ఏండ్లు పాలించం. కేసీఆర్ చంటి పిల్లను సాదుకున్నట్లు తెలంగాణను సాదుకున్నాం.. అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపాం. తండాలను గ్రామపంచాయతీలు చేశాం. కొత్త మండలాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాం. పరిపాలన ఫలాలు మీ ముంగిటకు రావాలని వికేంద్రీకరణ చేసుకున్నాం అని కేటీఆర్ తెలిపారు.

**ఆఖరికి సఫాయి సిబ్బందికి కూడా పైసలు పడట్లేదు**

పదేండ్ల పాటు అద్భుతంగా అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా ముందుకు తీసుకెళ్లాం. రైతుబంధు లాంటి కార్యక్రమం దేశంలో ఎవరూ అమలు చయలేదు. ఓట్ల కోసం మేనిఫెస్టోలో పెట్టకపోయినప్పటికీ.. రూ. 73 వేల కోట్లు రైతు బంధురూపంలో, రూ. 28 వేల కోట్లు రుణమాఫీ రెండు దఫాలుగా చేశాం. నాట్లేసే సమయంలో రైతుబంధు నిధులు వేసేటోళ్లం. అప్పుడు టింగ్ టింగ్ మని చప్పుడు వచ్చేది.. ఇప్పుడు టకీటకీ అని వస్తాయని రేవంత్ రెడ్డి అంటున్నడు. కానీ పైసలు ఎవరికీ పడలేదు. తులం బంగారం, రూ. 2500, స్కూటీలు, స్కాలర్ షిప్స్, రైతుబంధు, ఆఖరికి సఫాయి సిబ్బందికి పైసలు పడట్లేదు అని కేటీఆర్ తెలిపారు.

**రేవంత్ రెడ్డికి తిట్ల పురాణం తప్ప ఏం రాదు**

రేవంత్ రెడ్డికి తిట్ల పురాణం తప్ప ఏం రాదు. కానీ మనకు సంస్కారం ఉంది కాబట్టి ఆయనలా మాట్లాడం. కేసీఆర్ నువ్వు కొట్టుడు కాదు.. కట్టె లేకుండా నిలబడు అంటున్నడు. సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడు. కేసీఆర్ నిలబడడం కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దేశం ముందు సమున్నంగా నిలబెట్టిండు.. కేసీఆర్ కట్టె లేకుండా నిలబడుతడు.. రేవంత్ రెడ్డి కమిషన్ తీసుకోకుండా ప్రభుత్వాన్ని నడుపు దమ్ముంటే అని కేటీఆర్ సవాల్ విసిరారు.



**కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికనే లేదు..**

కేసీఆర్ కొడితే ఎట్ల ఉంటదో.. నీ పాత గురువు, ఇప్పుడు నీ గురువు తల్లిని అడుగు. కేసీఆర్‌కు, రేవంత్‌కు పోలికనే లేదు. కేసీఆర్ అంటే హిస్టరీ.. రేవంత్ అంటే లాటరీ.. టికెట్ కొనకుండా లాటరీ గెలిచినోడు. తప్పిదారి అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయితే ఆగతలేదు. నీ కంటే ముందు చాలా మంది సీఎంలుగా చేశారు. కేసీఆర్ పేరును నీవు కాదు కదా.. కాంగ్రెస్ తాత జేజమ్మలు దిగివచ్చినా మరిపించలేరు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం ఈ రాష్ట్రం ఎవరు తెచ్చారంటే కేసీఆర్ అంటరు. తిట్ల పురాణం బంద్ చేయ్.. హనీమూన్ పీరియడ్ కూడా అయిపోయింది. కొత్తగా రేవంత్ రెడ్డి సీఎం అయిండు కాబట్టి ఏమన్న చేస్తడోమే అనుకున్నాం.. కానీ ఏం చేయలేదు. ఇక సినిమా ఉన్నది ముంగిట. కేసీఆర్ అసెంబ్లీకి రా అంటున్నడు రేవంత్ రెడ్డి. నీకు దమ్ముంటే లగచర్లకు రా.. నీ సంగతి ఏంటో చెప్తరు.. సెక్యూరిటీ లేకుండా రా.. నీవు వస్తవో రావో తెలియదు కానీ త్వరలోనే పక్కా కొడంగల్‌కు దండయాత్రలా వస్తాం. భాజపా పోయి కొడంగల్‌లో మీటింగ్ పెడుతాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**అంబేద్కర్ ఒక వర్గానికో, ఒక కులానికో సంబంధించిన వ్యక్తి కాదు : కేటీఆర్**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఒక వర్గానికో, ఒక కులానికో సంబంధించిన వ్యక్తి కాదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గంలోని దాస్యానాయక్ తండాలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బోధించు.. సమీకరించు.. పోరాడు.. అని చెప్పిన అంబేద్కర్ పోరాట స్ఫూర్తిని పూర్తిస్థాయిలో ఆచరణలో పెట్టింది కేసీఆర్ మాత్రమే. ఏ విధంగా అంటే 2001లో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని లక్షల సంఖ్యలో ప్రజలను సమీకరిస్తూ, తెలంగాణ వస్తే వచ్చే లాభం ఏంటో బోధిస్తూ, ఆనాటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడుతూ.. 14 ఏండ్లు పోరాడి పోరాడి చివరకు అహింసాయుతమైన పద్ధతుల్లో చావు నోట్లో తలపెట్టి మీ అందరి దయతో అంబేద్కర్ రాసిన ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ సాధించుకున్నాం. ఆ మహనీయుడికి చప్పట్లతో ధన్యవాదాలు, నివాళులు చెప్పాలి. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లేకపోతే ఇవాళ తెలంగాణ లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచ మేధావుల్లో ఒకరిగా అంబేద్కర్‌ను ప్రపంచ దేశాలు గుర్తించాయి. హార్వర్డ్, ఆక్స్ ఫర్డ్ లాంటి యూనివర్సిటీలు పిలిచి.. 75 ఏండ్ల కిందట వారితో ఉపన్యాసాలు ఇప్పించుకున్నాయి. మన దేశంలో మాత్రం దళితులకు మాత్రమే ఆయనను ఆరాధ్య దైవంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అంబేద్కర్ ఒకళ్లకు పరిమితం కాదు. గాంధీ, నెహ్రూ కంటే ఎక్కువ మేధస్సు కలిగిన వ్యక్తి అంబేద్కర్ అని గుర్తించి, దాస్యానాయక్ తండాలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసి, ఆవిష్కరించేందుకు నన్ను పిలవడం ఆనందంగా ఉంది. దాస్యానాయక్ తండా ప్రజలకు రుణపడి ఉంటాను. దళితులకు, గిరిజనులకు మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వలేదు. మన దేశంలో అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత కావడం వల్ల 1952 ఎన్నికల్లోనే ఆడబిడ్డలందరికి ఓటు హక్కు కల్పించారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19 వల్లే ఈ దేశంలో స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నామని కేటీఆర్ తెలిపారు.

# పంచాయితీ ఎన్నికలపై కమలం ఫోకస్

**హైదరాబాద్ :** తెలంగాణలో త్వరలోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న వేళ.. కమలం పార్టీ కీలక చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కొత్త అధ్యక్షులను ఎంపిక చేసే పనిలో పడింది. ఈ క్రమంలోనే ఇప్పటికే వార్డు, గ్రామ, మండల, డివిజన్ అధ్యక్షుల నియమాకాన్ని పూర్తి చేసింది. అనంతరం జిల్లా అధ్యక్షుల నియామకంపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే సోమవారం కొత్త జిల్లా అధ్యక్షులను కమలం పార్టీ హైకమాండ్ ప్రకటించనుంది. ఈ మేరకు బీజేపీ తెలంగాణ ఇంఛార్జ్ సునీల్ బన్సల్, ఎన్నికల పరిశీలకులు అరవింద మీనన్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిలు కేంద్ర నాయకత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు బీజేపీ హైకమాండ్ ఓకే చెప్పడంతో జిల్లా అధ్యక్షుల ఎంపికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా అధ్యక్షులుగా పోటీ పడేవారు.. చి నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించింది. అయితే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 11 జిల్లాల అధ్యక్షుల ప్రకటనను హైకమాండ్ పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తుంది. మిగిలిన 22 జిల్లాలకు ఆశావాహుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆ తర్వాత నామినేషన్లను పరిశీలించి.. కొత్త జిల్లా అధ్యక్షులను సోమవారం బీజేపీ హై కమాండ్ ప్రకటించనుంది. మరోవైపు.. 2 నెలల క్రితం నుంచే రాష్ట్రంలో పార్టీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ జోరుగా నిర్వహించింది. ఆ తర్వాత కొన్నిరోజులకు బీజేపీ యాక్టివ్ మెంబర్ షిప్ డ్రైవ్‌ను కూడా చేపట్టింది. ఆ తర్వాత సంక్రాంతి పండగ వరకు గ్రామంలో వార్డు స్థాయి నుంచి మొదలుకొని దేశంలోనే జాతీయ అధ్యక్షుడి వరకు అన్ని ఎన్నికలు పూర్తి చేయాలని కమలం పార్టీ భావించినప్పటికీ కొన్ని కారణాల వల్ల ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తి కాలేదు. అయితే.. ఒక్కో రాష్ట్రంలో స్థానిక పరిస్థితులకు తగ్గట్టు.. యువత, మహిళలకు పెద్దపీట వేస్తున్న కమలం పార్టీ.. యాక్టివ్‌గా ఉన్న



కార్యకర్తలను వార్డు స్థాయి నుంచి మొదలుకుని.. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. మరోవైపు.. బీజేపీలో మొదటి నుంచి అధ్యక్షుడి ఎన్నికల ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. ఈ క్రమంలోనే మొదట బూత్ అధ్యక్షుడి నుంచి మొదలుకొని వార్డు, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధ్యక్షుల నియామకం ఉంటుంది. ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈ రాష్ట్ర స్థాయి ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఇక త్వరలోనే రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక కూడా ఉంటుందని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. కిషన్ రెడ్డి తర్వాత రాష్ట్ర బీజేపీ పగ్గాలు ఎవరికి అప్పగించాలి అనేది హైకమాండ్ తర్జన భర్జన పడుతోంది. మరోవైపు.. ప్రస్తుతం అధ్యక్ష రేసులో కీలక నేతలు ఆశతో ఉన్నారు. అయితే బీజేపీ హైకమాండ్.. బీసీ నేతలకు అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు మరోసారి బండి సంజయ్‌కే పార్టీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని పార్టీ కార్యకర్తలు, నేతల్లో జోరుగా చర్చ జరుగుతోంది. అయితే పార్టీ అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారో.. దాని ప్రభావం రాష్ట్రంలో పార్టీపై పడనున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైకమాండ్ ఆచితూచి వ్యవహరిస్తోంది. అయితే అన్ని రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక పూర్తి అయిన తర్వాతే జాతీయ అధ్యక్షుడి నియామకం జరగనుంది. ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా.. ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉన్నారు. ఆయన పదవీ కాలం ఇప్పటికే ఎప్పుడో పూర్తి అయినా.. పలు కారణాల వల్ల పొడిగిస్తూ వస్తున్నారు

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంకు అన్యాయం

-మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యతపై వారు చర్చించారు.

**బడ్జెట్‌పై శ్రీధర్ బాబు**

దేశ జీడీపీలో ఎక్కువ భాగం తెలంగాణదే అయినప్పటికీ, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన నిధుల వాటా తప్పనిసరిగా రావాలని ఆయన అన్నారు. పక్క రాష్ట్రానికి, ఇతర రాష్ట్రాలకు నిధులు ఎందుకు ఇచ్చారనే ఆలోచన తెలంగాణ ప్రజల్లో కలగకుండా ఉండాలంటే, ఇక్కడి బీజేపీ నాయకులు నిధులు తీసుకురావాలని ఆయన అన్నారు.

## దేశమంటే కొన్ని రాష్ట్రాలేనా..

-మొదటిపేజీ తరువాయి



ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదని తెలిపారు. దేశమంటే మట్టి కాదోయొ దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రసంగించిన నిర్మల సీతారామన్.. దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరమని మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. మొదటి నుంచి ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నది కేంద్ర ప్రభుత్వం అంటూ మండిపడ్డారు.

**తెలంగాణకు చోటు లేదా..**

"2024 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్, 2025 ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారు.. 2026 యూపీ బడ్జెట్, 2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడుతారా? యావత్ దేశానికి సరిపోయే బడ్జెట్ ఎప్పుడు పెడతారు? బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేదా? తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు విలువ లేదా? ఇది కేంద్ర బడ్జెట్‌లా లేదు, కేవలం మూడు, నాలుగు రాష్ట్రాల బడ్జెట్‌లాగా ఉంది. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏం సాధించినట్లు? తెలంగాణతో తమకు బంధం లేదని బడ్జెట్ ద్వారా మరోసారి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరూపించింది" అంటూ విమర్శలు గుప్పించారు.

**మరోసారి మోసపోయాం..**

కేంద్ర జీడీపీకి 5.1శాతం కాంట్రిబ్యూట్ చేస్తున్న తెలంగాణ మరోసారి మోసపోయిందన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ట్రైబల్ యూనివర్సిటీకి ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణకు నిధులు రాబట్టుకోవడంలో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తీరిగ్గా తేరుకొని, బడ్జెట్‌కు పది రోజుల ముందు 40 వేల కోట్లు కావాలని తూతూ మంత్రంగా లేఖ రాయడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేం లేదన్నారు. కేంద్రం బడ్జెట్ ద్వారా నిధులు రాబట్టుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని వ్యాఖ్యలు చేశారు. ఏడాది కాలంలో 30 సార్లకు పైగా ఢిల్లీకి వెళ్లారని.. ఏం సాధించారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**తెలంగాణకు అన్యాయం..**

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరు వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నిధుల కేటాయింపు సంగతి దేవుడెరుగు, విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేకపోయిందని అన్నారు. సంకీర్ణ యుగంలో, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు స్థానిక పార్టీల మద్ధతు కీలకం అయ్యే రోజొకటి వస్తుందని కేసీఆర్ ఎప్పుడూ చెప్పేవారని తెలిపారు. కేంద్రానికి మద్ధతు పలికిన జనతాదళ్ (యూ) బీహార్‌లో వివిధ అభివృద్ధి పనులకు గతేడాది రూ. 26,000 కోట్ల సాయం, 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్, గయాలో పారిశ్రామిక కారిడార్, నూతన విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలకు సాయం తదితరాలు పొందిందని తెలిపారు.

**ఎంపీలు ఏం చేస్తున్నారు..**

ఎన్నికలు దగ్గర ఉన్నాయని ఇప్పటి బడ్జెట్‌లో బిహార్ కు మరిన్ని వరాల జల్లు కురిపించారన్నారు. బిహార్‌లో మఖాన బోర్డు ఏర్పాటు, మిథిలాంచల్‌లో వెస్టర్న్ కోసి కెనాల్, ఐఐటీ పాట్నా విస్తరణ, బిహార్ లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. కానీ, నమ్మి 16 సీట్లలో కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే, ఇద్దరూ కలిసి తెలంగాణకు మొండి చెయ్యి ఇచ్చారంటూ విరుచుకుపడ్డారు. 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, రాష్ట్రానికి ప్రత్యేకంగా 8 రూపాయలు కూడా అధికంగా సాధించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కేంద్రం ఇతర రాష్ట్రాలకు కేటాయింపులు చేయడం సంతోషమని.. ఇందులో తమకు ఎలాంటి బాధ లేదన్నారు. కానీ తెలంగాణ పరిస్థితి ఏమిటో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రాజెక్టుల సంగతి ఏమిటి? పునర్విభజన చట్టం హామీల పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించాల్సిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనం దాల్చారని... కేంద్రం మెప్పు కోసం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు ప్రయోజనాల కోసం, తెలంగాణ ప్రజల కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ పార్టీయేనని మరోసారి రుజువైందన్నారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడటంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వైఫల్యం చెందుతున్నాయన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

## జాతీయ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేవని మరోసారి కేంద్ర బడ్జెట్‌తో రుజువైంది

జాతీయ పార్టీలు ఎప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేవని మరోసారి కేంద్ర బడ్జెట్‌తో మరోసారి రుజువైందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రెండు పార్టీల నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఆ 16 మంది కలిసి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తెచ్చింది అక్షరాల గుండు సున్నా అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన రేవంత్ రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల ఇవాళ ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. వరుసగా రెండో ఏడాది తెలంగాణకు చిల్లి గవ్వ కూడా తీసుకురాలేకపోయిన బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఎంపీలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమైన బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కులను, జాతి ప్రయోజనాలను కాపాడగలుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పిన మాట ఈ రోజు మరోసారి గుర్తుకు వస్తుందన్నారు. లోక్ సభలో తెలంగాణ పార్టీ అయినా బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుంటే జరిగే నష్టం ఏమిటో ప్రజల గమనిస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో ప్రాంతీయ పార్టీలకు బలమున్న బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం చూసి జాతీయ పార్టీలను గెలిపిస్తే తెలంగాణను నిండా ముంచారని ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 30 సార్లు ఢిల్లీకి పోయింది తెలంగాణకు నిధులు తెచ్చేందుకు కాదని, తెలంగాణ నుంచి ఢిల్లీకి మూటలు మోసేందుకేనని ఈ రోజు తెలిపోయిందన్నారు. కాంగ్రెస్ సీఎంగా ఉంటూ బీజేపీకి గులాంగిరీ చేస్తూన్న బడే భాయ్- చోటే భాయ్ అనుబంధంతో తెలంగాణకు నయాపైసా లాభం లేదని తేలిపోయిందన్నారు. తెలంగాణ నుంచి మరో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు గెలిచినా.. వారితో కూడా రాష్ట్రానికి దక్కింది గుండు సున్నానే అన్నారు. కేవలం ఢిల్లీ బాసులను ప్రసన్నం చేసుకునే పని తప్ప.. ఏనాడూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించిన పాపాన పోలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌కు తెలంగాణకు రావాల్సిన వాటా గురించి పోరాడిన దాఖలు లేకపోవడం వల్లనే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కేటీఆర్ మండిపడ్డారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ, కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణకు నిధులు తేస్తామంటూ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ గెలిచినా, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు ఒక్క నయా పైసా తీసుకురాలేకపోయారన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు తమ రాష్ట్రాలకు నిధుల వరద పారిస్తుంటే.. తెలంగాణ బీజేపీ ఎంపీలు, నిస్సహాయ మంత్రులు చేతకాని దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారు. తెలంగాణకు నిధులు తేలేని బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# కార్పొరేట్ల అక్రమ చౌరబాటు

వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన పత్రం (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్) పేరిట కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఆరెస్సెస్, బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వ కుత్సిత ఉద్దేశాలను బహిర్గతం చేస్తున్నది. రైతుల ప్రయోజనాలను బలిపెట్టి కార్పొరేట్ లాభాలను అత్యధిక స్థాయికి చేర్చడం కోసం పన్నిన పన్నాగమిది.రైతాంగ ఉద్యమం ముందుకు తెచ్చిన ఏ ఒక్క కోర్కెనూ కేంద్రం తీవ్రంగా తీసుకోలేదని ఈ ముసాయిదా స్పష్టం చేస్తుంది. గరిష్ట మద్దతు ధర (ఎం.ఎస్.పి)ను చట్టబద్ధం చేయడం, వ్యవసాయంపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం, రైతాంగానికి అనుకూలమైన పరపతి సదుపాయాలు కలిగించడం వంటి కోర్కెలను అసలు పట్టించుకోలేదని తెలుస్తుంది. రాజ్యాంగం 246వ అధికరణం ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వ జాబితా లోనిదని కంటితుడుపుగా ఒప్పుకుంటూనే ఆ ముసాయిదా ప్రధాన శైలి మాత్రం సమాఖ్య విధానంపై రాష్ట్రాల అధికారాలపై దాడి చేసేదిగా వుంది. రాష్ట్రాల ప్రాయోజితమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను నిర్మూలించడం, ఎ.పి.ఎం.సి ల పాత్రను రద్దు చేయడం, చిన్న మధ్యతరహా రైతాంగాన్ని ప్రైవేటు వ్యాపార కూటములకు విపరీతంగా లోబడిపోక తప్పని పరిస్థితి కల్పించడానికి దారితీసేదిగా వుంది. ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్ల ఏర్పాటు, ముఖద్వారంలోనే కార్పొరేట్ వ్యాపారులు, ఎగుమతిదారులు కొనుక్కునే అవకాశం కల్పించడం వంటి అంశాలు ఈ ముసాయిదా ప్రధానంగా సూచిస్తున్నది. సంప్రదాయక వ్యవసాయ మార్కెట్ యార్డుల స్థానంలో కార్పొరేట్ అధీనంలోని గోదాములు, సిలోలు తీసుకురావడం, రాష్ట్ర వ్యాపిత మార్కెట్ ఫీజును వాణిజ్య ఫీజును ప్రవేశ పెట్టడం వంటివి ఈ ముసాయిదాలో ప్రధానంగా సూచించిన సంస్కరణల్లో వున్నాయి. బడా కార్పొరేట్లు ఎ.పి.ఎం.సి మార్కెట్ యార్డులను తోసిపుచ్చి తామే నేరుగా రైతుల ఉంచి కొనుగోలు చేయాలని ఆ ముసాయిదా ప్రతిపాదిస్తున్నది. రిలయన్స్, అదానీలతో సహా బడా కార్పొరేట్ కంపెనీలకు విస్తారమైన గోదాము వ్యవస్థ వుంది. హర్యానాలోని సిర్సా, పంజాబ్‌లోని లుధియానాలలో ప్రైవేటు రైల్వే నెట్‌వర్క్ కూడా వుంది. ఎం.ఎస్.పి అనే దానికి కార్పొరేట్ లాబీ, అలాగే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారులు పచ్చి వ్యతిరేకతతో వున్నారు. ఎందుకంటే వ్యవసాయోత్పత్తులను కారుచౌకగా కొనేయడమే ఎప్పుడూ వారి వ్యూహంగా వుంటున్నది. దానికి కొంత నాణ్యత జోడించి బ్రాండు వేసి మార్కెట్‌లో అమ్ముకోవడమే వారి లక్ష్యం. ఈ క్రమంలో విపరీతమైన లాభాలు గుట్టలు పోగు పోసుకోవాలని చూస్తారు. ఈ విధంగా బడా వ్యాపార వర్గాలు రైతులనూ అలాగే వినియోగదారులను కూడా దోచుకుంటున్నాయి. మార్కెట్ సామర్థ్యం పేరుతో కేంద్రం వ్యవసాయోత్పత్తులను కార్పొరేట్ లూటీకి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేస్తున్నది. కార్పొరేట్ పరిశ్రమలు, వాణిజ్యవేత్తలు ప్రాథమిక ఉత్పత్తిదారులైన రైతుల నుంచి తాము కబళించిన అదనపు లాభంలో కొంత శాతాన్నయినా వారు అందించిన ముడి సరుకుకు గిట్టుబాటు ధరగా కలపాలని ముసాయిదాలో ఎలాంటి నియంత్రణ నిబంధన పెట్టలేదు. ఈ విధంగా బిజెపి నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు లొంగిపోతున్నది. రైతాంగ ఆత్మహత్యలు, రుణభారం కొనసాగడానికి కారణమవుతున్నది. రైతాంగం దివాళా తీసే పరిస్థితిని సృష్టిస్తున్నది. ఎ.పి.ఎం.సి చట్టాన్ని రద్దు చేయడంతో బీహార్‌లో మండీలు పోయాక ఎలాంటి శోచనీయ పరిస్థితులు ఏర్పడ్డాయో ఈ నివేదిక డాక్యుమెంటుగా నివేదించడం చెప్పుకోదగిన అంశం. ఇదెంతో వైరుధ్యభరితం. పరాకాష్ట. ఎందుకంటే ఢిల్లీలో రైతాంగ పోరాటం తారా స్థాయిలో వుండగా.. ఆరెస్సెస్–బిజెపి వర్గాలు, కేంద్ర ప్రభుత్వానికి సన్నిహితులైన కార్పొరేట్ వర్గాలు ఎ.పి.ఎం.సి చట్టం రద్దును వ్యవసాయ మార్కెట్ల నియంత్రణ ఎత్తివేతకు గొప్ప ఉదాహరణ అన్నట్టు కథనాలు ప్రచారంలో పెడుతూ వచ్చాయి. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయాలని ఈ ముసాయిదా సుస్పష్టంగా చెబుతోంది. వ్యవసాయాన్ని సంస్కరించడానికి అదొక్కటే మార్గమని చూపిస్తున్నది. ఉదాహరణకు ఈ ముసాయిదా ఎంతో గొప్పగా చెప్పబడిన మోడీ అత్యంత ప్రియ పథకమైన ఎఫ్.పి.వో పథకం కార్పొరేట్ చౌరబాటుకు మార్గంగా ఊహిస్తున్నది. దీని ప్రకారం ఎఫ్.పి.వోలు క్లస్టర్ల ప్రాతిపదికగా బడా వ్యాపార సంస్థలతో కాంట్రాక్టు ఏర్పాట్లు చేసుకుని రంగంలోకి దిగడానికి సానుకూల వాతావరణం సృష్టించాల్సి వుంటుంది. ఎఫ్.పి.వో పథకాన్ని ముందుకు తీసుకుపోవడానికి వీలుగా సి.ఐ.ఐ, ఎఫ్.ఐ.సి.సి.ఐ వంటి కార్పొరేట్ గ్రూపులు చూపిస్తున్న మహా ఆరాటం ఇప్పుడు ఆవిష్కృతమవుతున్నది. ఫ్యూచర్స్ బహిరంగ మార్కెట్ ద్వారా పెట్టుబడుల ప్రవేశాన్ని మరింత లోతుకు తీసుకుపోవాలన్న సూచనను కూడా ఇదే బడా వ్యాపార సంస్థల ఉచ్చుగా మాత్రమే చూడవలసి వుంటుంది. దీనివల్ల బహుళజాతి కంపెనీలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు దేశీయ ఆహార పరిశ్రమలోకి ప్రవేశించి ఆధిక్యత సంపాదించి నియంత్రించేందుకు అవకాశం లభిస్తుంది. తద్వారా భారతీయుల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. ఈ ముసాయిదాకు ఇప్పటికే గట్టి ప్రతిఘటన మొదలైంది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుపై ఈ ముసాయిదాను దగ్ధం చేస్తూ దేశ వ్యాపితంగా వేలాది మంది రైతులను డిసెంబరు 23న ప్రదర్శనలో సమీకరించింది. అదే విధంగా జనవరి 26న ట్రాక్టర్లు/వాహనాల ర్యాలీలలోకి తీసుకొచ్చింది. హర్యానాలోని తౌహనాలోనూ పంజాబ్‌లోని మోగాలోనూ జరిగిన రెండు మహా కిసాన్ పంచాయత్‌లలోనే 75 వేల మంది రైతులు సమీకృతులైనారు. ఇటీవలనే ఢిల్లీలో జరిగిన ఎస్.కె.ఎం జాతీయ సమావేశాలు ఈ పోరాటాన్ని మరింత తీవ్రం చేయాలని ప్రతినబూనాయి. భారత దేశ వ్యవసాయ రంగాన్ని దేశ విదేశీ కార్పొరేట్లకు బంగారు పళ్లెంలో పెట్టి అప్పగించాలని చూస్తున్న బిజెపి, ఆరెస్సెస్ ప్రభుత్వ ప్రయత్నాలను అన్ని తరగతుల ప్రజలూ బలంగా ప్రతిఘటించడం అవసరం.

# హిందీ వ్యాప్తికి మోటూరి సేవలు



మోటూరి సత్యనారాయణ హిందీ భాష ప్రచారానికి ఎనలేని సేవలు అందించిన విద్యావేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ సభలో సభ్యులు. 1966 వరకు రాజ్యసభ (భారత ప్రభుత్వ ఎగువ సభ) లో నామినేటెడ్ సభ్యులు. భారత రాజ్యాంగంలో హిందీని అధికారిక భాషగా మార్చడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. రాజభాష కమిషన్ సభ్యులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, రాజ్యసభ సభ్యులుగా, హిందీ వికాస సమితి స్థాపకులుగా, హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శిగా, బహుభాషా వేత్తగా బహుముఖ సేవలు అందించిన ప్రతిభా శాలి. భారత ప్రభుత్వ పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత. మోటూరి సత్యనారాయణ (ఫిబ్రవరి 2, 1902 – మార్చి 6, 1995) 1902, ఫిబ్రవరి 2 వ తేదీన కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో పెద పిచ్చయ్య, రత్తమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య అనంతరం తెలుగు, సంస్కృతం అభ్యసించాడు. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఉన్నతులైన గురువుల వద్ద శిక్షణ పొంది హిందీ బాగా అభ్యసించారు. తర్వాత ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మొదలైన భాషలు కూడా నేర్చుకున్నారు. ఆయనకు రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఐతిహాసిక, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలలో లోతుగా ప్రవేశం ఉండేది. అయన హిందీ ప్రచారంతో జీవితాన్ని ప్రారంభించి క్రమంగా సంఘటకులుగా, కార్యదర్శిగా, చివరకు 1938లో హిందీ ప్రచార సభకు ప్రధాన కార్యదర్శి అయి 1961 వరకు కొనసాగారు. ఆ సంస్థ ప్రథమ ప్రధాన కార్యదర్శి పండిత హరి హర శర్మకు కుడిభుజంగా ఉండి సహకరించారు. అయన దూరదృష్టి, అవగాహన వల్లనే ఈ సభ హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగవారి బంధనం నుండి విముక్తి పొంది 1927లో స్వతంత్ర సంస్థగా ఆవిర్భవించింది. మోటూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతకాలం దక్షిణ భారత హిందీ ప్రచార సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింప దగినది. 1936లో ప్రచారసభకు 4 రాష్ట్రాలలో, 4 ప్రాంతీయ శాఖల నిర్మాణం అయన దూరదృష్టిని నిరూపిస్తుంది. మోటూరి సత్య నారాయణ... మహాత్మాగాంధీ, రాజేంద్ర ప్రసాద్ లకు అత్యంత విశ్వాస పాత్రులు. 1946లో జరిగిన సభ రజతోత్సవానికి బాపూజీ 12 రోజులు ఉండి సమావేశాలు జరిపించారు. ప్రతి దినం గాంధీ ప్రార్థనా సమావేశాలలో వేలాది మంది పాల్గొనేవారు. మద్రాసు కార్పొరేషన్ నుండి త్యాగరాయ నగరంలో సుమారు ఐదున్నర ఎకరాల భూమిని సంపాదించి అప్పటి అవసరాల కనుగుణంగా భవనాలను నిర్మించారు. ముద్రణాలయం, పుస్తక ప్రచురణ, పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూర్చారు. హిందీ ప్రచారాన్ని పెంపొందించడానికి ప్రతి రాష్ట్రంలోను, కొన్నిజిల్లాలలోను, మండలాల వారీగా సంరక్షకులను ఏర్పాటుచేసి నూతన ప్రణాళికల ద్వారా దక్షిణ భారతమంతా మారుమూలల వరకు హిందీని వ్యాపింప జేశారు. మోటూరి నేతృత్వ కృషి ప్రజలలో హిందీ పట్ల ప్రేమ, గౌరవం పెంచింది. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమర యోధులుగా తామ్రపత్ర గ్రహీతలయ్యారు. రాజకీయ రంగంలో కూడా విలువైన సేవలు అందించారు. భారత రాజ్యాంగ చట్టంలో 17వ భాగం రాజభాష అధ్యాయ నిర్మాణంలోను, దాని డ్రాఫ్టింగ్, రాజ్యాంగ సభలో నెగ్గించడంలో అయన కృషి, సహకారం ఎంతో ఉన్నాయి. రాష్ట్రపతి ద్వారా 1954 నుండి 1966 వరకు వరుసగా రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయబడ్డారు. 1956లో రాజభాషా కమిషన్ కు సభ్యులుగా పనిచేశారు. తెలుగు భాషా సమితి స్థాపక కార్యదర్శిగా "తెలుగు విజ్ఞాన సర్వస్వం" 16 భాగాలలో ప్రచురించారు. అదే విధంగా హిందీ వికాస సమితిని కూడా స్థాపించి హిందీలో "విశ్వవిజ్ఞాన సంహిత" పేరుతో హిందీ విజ్ఞాన సర్వస్వాలను ప్రచురింపచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను కళాప్రపూర్ణతో గౌరవిస్తే, కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ తో సన్మానించాయి. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ (1958), పద్మభూషణ్ (1962) పురస్కారాల్ని ఇచ్చి గౌరవించింది. అయన సేవలను పురస్కరించుకుని హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 1957లో పెద్ద ఎత్తున అభినందన సభ జరిపి అభినందన గ్రంథం సమర్పించారు. ఆయన 1995 సంవత్సరం మార్చి 6 వ తేదీన పరమపదించారు.

# రుతుసంబంధ వసంత పంచమి



'వసంత పంచమి'గా పిలువబడే మాఘ శుద్ధ పంచమి ప్రధానంగా రుతు సంబంధ పర్వదినం. ఈదినమే చదువుల తల్లి "సరస్వతి జయంతి" గా కొన్నిచోట్ల భావించ బడుతుంది. దీనిని "సరస్వతి పూజా దినంగా, శ్రీపంచమి, మదన పంచమి, రతి కామ దమనోత్సవ పర్వదినం"గా పంచాంగ కర్తలు పరిగణిస్తారు. వసంత పంచమి నామాన్ని బట్టే దీనిని రుతు సంబంధమైనదిగా భావించవచ్చు. మకర సంక్రాంతి తరువాత ఉత్తరాయణం ప్రారంభం అవుతుంది. ఆకాలంలోనే క్రమంగా వసంత రుతు లక్షణాలైన చెట్లు చిగుర్చడం, పూలు పూయడం కనిపిస్తుంది. మాఘ మాసమే వసంత రుతువుకు ఆరంభమనే వాదనకూడా ఉంది. వసంతోత్సవారంభానికి వసంత పంచమినే కొందరు పంచాంగ కర్తలు ఉదహరిస్తారు. రాగల వసంత రుతువుకు శిశిరంలోనే స్వాగతించే పండుగ ఇది. ఈనాటి కృత్యాలలో నూతన వస్త్రధారణం, తైల స్నానాలు ప్రధానాలని చెప్పబడింది. నూతన వస్త్ర ధారులై, బుక్కా, వసంతం చల్లుకునే పండుగ అయినందునే వసంత పంచమి అని నామాంకితమైంది. "నవాన్న భక్షణ దినం"గా, సంక్రాంతికి వచ్చే ధాన్యాన్ని ఈ రోజు అన్నం వండి కులదేవతలకు నివేదించి తినే ప్రాచీన ఆచారమూ కొన్ని ప్రాంతాలలో ఉన్నది. ప్రాచీన కాలంలో "రోమనులు" కూడా "వసంత రుతు పండుగ"ను ఇదే రోజు, ఇదే మాదిరిగా చేస్తుండే వారని పేర్కొనబడింది. బ్రహ్మవైవర్త పురాణంలో.. ప్రకృతి ఖండంలో నాలుగో అధ్యాయంలో అన్ని శక్తులలో ప్రధానమైన శక్తిగల సరస్వతిని వసంత పంచమినాడు పూజించాలని చెప్పబడింది. కనుక వసంత పంచమి "విద్యారంభ దినం". జ్ఞానప్రాప్తి కోసం సరస్వతిని ఆరాధించమని బ్రహ్మవైవర్త పురాణం చెప్తోంది. విద్యకు అధిదేవతయైన సరస్వతిని మాఘ మాసమందు తాటియాకులు, గంటము, గ్రంథము లాది విద్యాసాధనములను దేవి ఎదుట ఉంచి, గంధ పుష్పాదులతో గ్రంథ రచన ప్రారంభ సమయంలో పూజించే ఆచారం ఉండినట్లు సురవరం ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. "యాకుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా యా వీణావరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా, యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభి దేవై సదా పూజితా, సామాంపాతు సరస్వతీ, భగవతీనిశ్శేష జడ్యా పహః" శ్లోక పఠనంతో పిల్లల చదువు ప్రారంభం అవుతుంది. సరస్వతీదేవి అహింసాదేవి. ఆయుధాలు ఏమీ ధరించని దేవత. తెల్లటి పద్మం మీద సరస్వతి నిల బడి ఉన్నట్లు, ఒక కాలు నిలువుగాను, మరొక కాలు దానిమీద అడ్డంగాను ఉంచుకుని, ఒక చేత వీణ మరొక చేత పుస్తకము ధరించి ఉన్నట్లు పద్మ పురాణ లిఖితం. తెల్లటి బట్టలు ధరించి, తెల్లటి పూలు, తెల్ల పూసల కంఠహారం, దానిపై తెల్లగంధం పూత తెల్లని వీణాపాణితో కూడిన ప్రశాంత, శాంతి దేవత సరస్వతి. పూజా సందర్భంలో చదువుకు, వ్రాతకు సంగీతానికి సంబంధించిన పరికరాలను ఆమె ముందుంచడం అనవాయితీ. సర్వవిద్యలకూ ఆధారమైన వాగ్దేవి చెంత పుస్తకాలు, కలాలు ఈ రోజున ఆరాధిస్తారు. "మాఘ శుక్ల పంచమ్యాం విద్యారంభే దినేపి చ పూర్వేహ్ని సమయం కృత్యా తత్రాహ్న సంయుతః రుచిః...'వసంత పంచమి రోజున ప్రాతఃకాలంలో సరస్వతీదేవిని పూజించి విద్యారంభం చేయాలని చెప్పబడింది. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ్ఞ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. సరస్వతి ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. చదువుల తల్లి కృపతో సద్బుద్ధినీ పొందుతారు. పసుపు పచ్చని బట్టలు ధరించి, సరస్వతికి రోజంతా పూజలు నిర్వహిస్తూ, కీర్తనలు పాడడం సనాతన సాంప్రదాయం. ఈనాడే రతీదేవి కామదేవత పూజ చేసినట్లు, రుతురాజు వసంతునికి కామ దేవుడు మంచి మిత్రుడైనట్లు, కనుక ఈనాడు "రతీ మన్మధ, వసంతుల పూజలు" చేయాలని పురాణ కథనం. రతీ మన్మథులను పూజించి మహోత్సవ మొనరించవలెనని, దానములు చేయవలెనని, దీని వలన మాధవుడు (వసంతుడు) సంతోషించునని నిర్ణయామృతకారుడు పేర్కొన్నాడు. రుగ్వేదంలో ప్రధానంగా గ్రీష్మ, శారద వసంత కాలాలు మూడే పేర్కొనబడినాయి. వసంత పంచమి నాటికే మామిడి తదితర చెట్లు బాగా చిగురించి, పుష్పిస్తాయి. పనస మొదలైనవి పైరు గాలికి పిందెలుగా మారుతాయి. శీతాకాలపు పడిశాలు దగ్గులాంటి రుగ్మతలు క్రమంగా తగ్గుతాయి.

# జీవవైవిధ్య కేంద్రాలు.. చిత్తడి నేలలు

సముద్రం, నది, ఇతర నీటి వనరుల తీర ప్రాంతాలలో లోతు తక్కువ వుండి ఎక్కువ కాలం నీటి నిల్వ వుండే భూములను చిత్తడి నేలలు అంటారు. మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలే. ఎగువ ప్రాంతంలోని భూములు అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డు కట్ట వేస్తాయి. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలు గుడ్లు పెట్టడానికి ఈ చిత్తడి నేలలు చాల అనుకూలం. సమీప నీటి నాణ్యతను పెంచడం లోను, కాలుష్య కారకాలను గ్రహించడం లోను చిత్తడి నేలలు ప్రాధాన్యతను పోషిస్తాయి. మానవుల తప్పిదాలతో పర్యావరణానికి చాల హాని కలుగు తున్నది. అలాగే చిత్తడి నేలలకు కూడా మినహాయింపు లేకుండా పోతున్నది. ఫలితంగా హాని జరుగు తున్నది. ప్రజలు వ్యవసాయ అవసరాలకు ఈ భూములను ఆక్రమించు కొని రసాయన ఎరువులకు వాడడం వల్ల.... నివాస యోగ్యానికి ఈ నేలలను పూడ్చడం తోను, చిత్తడి నేలలు విధ్వంసానికి గురవు తున్నాయి. ప్రభుత్వం పరిశ్రమల కొరకు చిత్తడి నేలలను కేటాయిచడంలో అవి మరింత విధ్వంసానికి గురవు తున్నాయి. చిత్తడి నేలల పరిరక్షణకు 1971, ఫిబ్రవరి రెండవ తేదీన ఇరాన్ లోని రాంసార్ లో ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. అప్పుడు తీసుకున్న ఉమ్మడి ఒప్పందం పై 164 దేశాలు సంతకం చేశాయి. దాన్నే "రాంసార్ ఒప్పందం" అంటారు. చిత్తడి నేలల పరిరక్షణకు ఈ ఒప్పందంలో కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. భారత దేశం కూడా ఈ ఒప్పందం పై సంతకం చేసింది. చిత్తడి నేలలు జీవ వైవిధ్యానికి కేంద్రాలు. ఈ ప్రదేశాలలో చాలా జల చర, ఉభయ చర జీవులు... మొక్కలు, జంతువులు ఉంటాయి. చిత్తడి నేలలు ముఖ్యంగా నదీ పరీవాహక ప్రదేశాలు, సముద్ర తీర ప్రాంతాల కు సమీపంగా ఉంటాయి. ఇవి నదుల గుండా వచ్చే కాలుష్య కారక పదార్థాలను, తమలో ఇముడ్చు కుంటాయి. సముద్ర భారీ అలల నుండి సునామీల నుండి తీర ప్రాంతాలను రక్షిస్తాయి. అదే విధంగా నదుల వరదల నుండి కాపాడుతాయి. సముద్ర ప్రాంతాలు, నదీ తీరాలు, చెరువులు, సరస్సులు, నీటి ముంపు ప్రాంతాలు, తీరాల సమీపంలోని ఉప్పునీటి కయ్యలు, మడ అడవులు, మానవ నిర్మిత చేపల చెరువులు, వరి పొలాలు, సాగునీటి ఆనకట్టలు వంటివి చిత్తడి నేలల కోవకు చెందుతాయి. మానవాళి మనుగడకు ఈ నేలలు ఎంతో కీలకం. అయితే మానవుడు తన ఆవాసాల కోసం ఇలాంటి చిత్తడి నేలలను పూడ్చి గృహాలు నిర్మించడం వల్ల చిత్తడి నేలలు కనుమరుగు అవుతున్నాయి. దీనికి ఉదాహరణ ముంబై , కోల్ కత వంటి నగరాలు. దీని వల్ల బయో డైవర్సిటీ తీవ్రంగా నష్టపోతుండటం జరుగుతున్నది. ఈ క్రమంలో 1971 ఫిబ్రవరి 2 వ తేదీన ఇరాన్ దేశం లోని "రాంసార్" పట్టణంలో చిత్తడి నేలల సంరక్షణకు ఒక సదస్సు జరగగా, అన్ని దేశాలు చిత్తడి నేలలను రక్షించడానికి అంగీకరించాయి. అప్పటి నుండి ఫిబ్రవరి 2 వ తేదీని ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంగా జరుపు కుంటున్నారు.చిత్తడి నేలల అవసరాన్ని తెలియజెప్పి, సమాజాన్ని చైతన్య పరచడం ద్వారానే వాటిని పరిరక్షించు కోవడం సాధ్యమవుతుంది. అందుకోసం వివిధ స్థాయుల్లో అవగాహన కల్పించాలి. విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయాలి. విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సాగునీరు, వ్యవసాయ, మత్స్య, అటవీ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో చిత్తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలి. గడచిన యాభయ్యేళ్ల కాలంలో చిత్తడి నేలల్లో సుమారు 60 శాతం మత్స్య సంపద, పక్షులు, క్షీరద సంతతి, సరీసృపాలు, ఉభయ చరాలు ఇప్పటికే అంతరించినట్లు పరిశోధనలు తెలుపు తున్నాయి. ఇకనైనా మేల్కొని, ఇంకా అంతరించి పోకుండా కాపాడుకోవడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సి ఉంది.

# లక్ష విలువగల హండి, 2బీరువాలు బహుకరణ

## నేడు పాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవం

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల శ్రీ అలర్మెల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామికి జటప్రోల్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వలిపి మురళీధర్ రావు,ప్రభావతమ్మ దంపతులు స్వామివారి మొక్కు తీర్చుకొనుటకు లక్ష రూపాయల విలువ గల హుండీ మరియు రెండు బీరువాలు శనివారం నాడు దేవాలయ కార్యనిర్వాహ ణాధికారి సిహెచ్ రంగారావుకు ఆలయంలో అందజేశారు.అనంతరం ప్రధాన అర్చకులు కురవి రామానుజ



చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం చేశారు.కుటుంబ సభ్యులు గోపాలకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.నేడుపాలెం దేవాల యంలో స్వామి వారి కళ్యాణోత్సవంపాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలు భాగంగా ఆదివారం నాడు ఉదయం 10 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తు న్నట్లు ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి తెలిపారు.ఈ ప్రాంత భక్తులు స్వామి వారి కళ్యాణం లో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలని ఆయన కోరారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు 1516/-చెల్లించి దంపతులు సాంప్రదాయం దుస్తులలో పాల్గొనాలని కోరారు.

# ప్రజా తీర్పును గౌరవించని మాజీ ముఖ్య మంత్రి చంద్రశేఖర్ రావు

## తలకొండ పల్లి మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, పది సంవత్సరాలు తెలంగాణ ప్రజలు అధికారం కట్ట బెడుతే పామ్ హౌస్ నుండి బయటకు రాకుండా ప్రజా సమస్యలు ఏనాడూ పట్టించు కాకుండా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నీ విమర్శించడం సరికాదు అన్నారు. ఫాం హౌస్ నుండి బయటికి వస్తే ఎట్లా ఉందో మేము చూపిస్తాం అన్నారు.ఇంకా మిమ్మల్ని భరించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని



తొమ్మిది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోచుకుని ఫామ్ హౌస్ లో ఉండి ఇవాళ బయటకు వస్త అం టుం డు.పార్టీని, కార్య కర్తలను కాపాడు కోవ దానికి వా ళ్లను వీళ్లను కేసీ ఆర్ ప్రయ త్నాలు చేస్తు న్నా రు మీరు విధ్వంసం చేసిన ఆర్థిక వ్య వస్థను గాడిలో పెట్టడానికి ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం పడుతుంది.అనిఏడాది పాటు కనిపించని కేసీఆర్ ఏమొకం పెట్టుకొని బయటకు వస్తడో వాళ్లను వీళ్లను బతిమిలాడుకొని పార్టీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు.బీజెపి ఆటలో మీరు ఎట్లా కీలుబొమ్మగా మారారో అంతా తెలుసు అని భారతీయ జనతా పార్టీ ముసుగులో బారాస పేరు పెట్టుకుని మళ్లీ తెలంగాణ సెంటిమెంట్తో వస్తే ప్రజలు ఎట్లా స్వీకరిస్తారో చూద్దాం.అని తల కొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.తెలంగాణలో ఇంకా మీకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందను కోవడం మీ మూర?త్వం, అన్నారు.

# నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలి







## ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్టాండ్ ఆవరణలో నీటి శుద్ధి కేంద్రం సందర్శన

## ఐక్యత ఫౌండేషన్ చైర్మన్టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి.

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ అవరణలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి,నిర్వహణ లోపం,అపరిశుభ్రంగా ఉండడం గమనించి.సరైన నిర్వహణతో పాటు పరిశుభ్రంగా ఉంచాలి అని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా త్రాగునీరు అందించవల్సింగా నిర్వహణ సిబ్బందికి సూచించడం జరిగింది.అలాగే బస్టాండ్ అవణరణలో ప్రయాణికులు తెలియజేసిన సమస్యలను,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేల ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో.స్థానిక నాయకులతో పాటు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 15వ తేదీ నీ సెలవుదినంగా ప్రకటించాలి



## పిసిసి అధికార ప్రతినిధి, పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** వెల్దండ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్ ,గిరిజనకుల పోరాట సమితి నాయకుడు శంకర్ నాయక్ తో మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ జయంతి అయిన ఫిబ్రవరి 15 వ తేదీనీ జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని ఆయన కోరారు. అనంతరం గిరిజన నాయకులతో కలిసి చలో ఢిల్లీ పోస్టర్ను విడుదల చేస్తూ ఈనెల 12న ఢిల్లీలోని జంతర్ మంతర్ లో గిరిజన హక్కులకై ధర్నా నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో గిరిజనకుల పోరాట సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకులకు అండగా ఉంటా

## చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** వెల్దండలం మండల కేంద్రంలో ఇటీవల కాలంలో మోటా ర్ సైకిల్ ప్రమాదానికి గురై గాయాలైన బిఆర్ఎస్ పార్టీ ఉద్యమకారులు, బిఆర్ఎస్ సీనియర్ నా యకులు కర్ణకంటి వెం కటయ్య, బిట్టు మహేష్, మక్కపల్లి యాదగిరి ఒక్కొక్కరికి 5000/- చొప్పున 15,000/- వేల రూపాయలు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఈ కార్యక్రమంలో ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిలి ఆనంద్ ,సిద్దగోని రమేష్ గౌడ్, కోమ్ము నాగయ్య, దారమోని గణేష్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# యంగంపల్లి లో ఘనంగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

## గ్రామంలో ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలి

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం లింగంపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని కమిటీ నిర్వాహకులతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోనీ ప్రజలు ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి అని, అప్పుడు ప్రజల మనసు ఎప్పుడు శాంతి యుతంగా ఉంటుంది అన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి,భూపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బాల్ జంగయ్య,వెంకటేష్, మహేందర్,వంశీ,కిరణ్,తిరుపతి రెడ్డి,



శ్రీశైలం తది తరులు పాల్గొన్నారు.

# రొంపి కుంటలో భక్త మార్కండేయ మహర్షి జయంతి.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలంరొంపికుంట గ్రామంలో భక్తమార్కండేయ మహర్షి జయంతి సందర్భంగా పద్మశాలి సేవా భవనంలో మార్కండేయ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి స్వీట్ పంపిణీని చేశారు. గ్రామశాఖ అద్యక్షులు కూచన మల్లయ్యమహర్షి అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కుందారపు బాపు ముఖ్య అతిథిగా పాల్గొని మార్కండే య మహర్షి గొప్ప శివభక్తుడు అని వివరించారు.ఈ కార్య క్రమంలో గ్రామకమిటీ ప్రధాన కార్యదర్శి కుందారపు శంకర్ ,మల్లయ్య,కొండి మల్లయ్య ,అనిల్, రాంబాబు, వేముల శ్రీనువాస్ ఊరగొండ కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయ నిర్మాణానికి తన వంతూ కృషి చేస్త



## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం లోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ సంఘం వారు హైదరాబాదులోని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎల్లికట్ట గ్రామంలో నిర్మించ తలపెట్టిన చెన్నకేశవ స్వామి దేవాలయానికి సహకరించాలని కోరగా ఉప్పల వెంకటేష్ సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ సైన్యం తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్,ఎల్లికట్ట గ్రామ పెద్దలు భీమయ్య, కేశవులు, కృష్ణ, సత్యనారాయణ ,రవి, కుర్మయ్య ,బాల చెన్నయ్య, ఆంజనేయులు, వేణు, చెన్నయ్య ,శ్రీకాంత్, వెంకటయ్య, కృష్ణయ్య, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ



## సందీప్ కుమార్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** మిడ్జిల్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్, తన తల్లి కీర్తిశేషులు జయమ్మ జ్ఞాపకార్థంగా గతంలో పనిచేసిన వస్పుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల త్రాగునీటి కోసం ఆల్కలైన్ వాటర్ ప్యూరిఫైయర్ మిషన్ తన తండ్రి రిటైర్డ్ హెడ్మాస్టర్ బాల్ శంకరయ్య చేతుల మీదుగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు తారా సింగ్ తో ఉపాధ్యాయ బృందానికి అందజేయడం జరిగింది. అనంతరం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న కాయితి ఆషాదీప్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం లోని యంగం పల్లి గ్రామంలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు , లక్ష్మీ నరసింహా స్వామి దజ స్తంభం ఏర్పాటు చేయడం జరిగింది. బ్రహ్మోత్సవాలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆషాదీప్ రెడ్డి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అంజనేయ స్వామి మరియు లక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం దేవాలయ నిర్వాహకులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో, గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో తెలంగాణకు తీరని అన్యాయం

## మండ్ల దేవన్ననాయుడుకాంగ్రెస్ పార్టీనాయకులు

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తమ మిత్రపక్షాలకు చెందిన రాష్ట్రాలకు మాత్రమే కేటాయింపులు చేసి, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో మొండి చేయి చూపిందని కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపక్కన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వేలకోట్లు కేటాయించి, తెలంగాణ ప్రజలకు వరప్రదాయిని పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు బడ్జెట్ లో నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపి, తెలంగాణ ప్రజల ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందని అన్నారు.

# ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలి



రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎన్ . వెంకట స్వామి

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎన్ . వెంకట స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం పారిశుద్ధ్య విభాగం అధికారులు , సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా , ఆన్ లైన్ లో , ఫోన్ ద్వారా , పౌర సేవా కేంద్రం లో ధరఖాస్తు ద్వారా , ఏ రూపంలో ఫిర్యాదు వచ్చినా జాప్యం చేయకుండా పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు. మల్కాపూర్ లోని పశువధ శాల ను ఉపయోగం లోకి తీసుకురావాలని అన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ పటిష్టంగా జరగడంతో పాటు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ , కంపోస్ట్ యార్డ్ , డి ఆర్ సి సి సెంటర్ లకు తరలించాలని అన్నారు. ఈ సమావేశంలో రామగుండం నగర పాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం అధికారులు నాగ భూషణం , సునీల్ రాథోడ్ , సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# నాతమయ్యను కోల్పోవడం దురదృష్టకరంపార్టీకి తీరని లోటు



మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు నాథమయ్య అకస్మాత్తుగా మరణించడం దురదృష్టకరం అని అన్నారు.క్రమశిక్షణ గలిగిన నాయకుడిని కోల్పోవడం తీరని లోటని భగవంతుడు వారి ఆత్మకు శాంతి కలిగించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.నాతమయ్యా పార్థివ దేహాన్నికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.నిరంజన్‌రెడ్డివెంట వనం.రాములు,కర్రేస్వామి,జగన్నాథంనాయుడు, విశ్వరూపం ,ఎల్లారెడ్డి, మాజీద్, వడ్డే.రమేష్ తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రులకు పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి..



వనపర్తి జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగంధర్

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**పెద్దమందడి మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బలిజపల్లిని జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగంధర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శేఖర్ మరియు క్వాలిటీ కోఆర్డినేటర్ మహానంది సందర్శించారు.

పదవ తరగతి విద్యార్థులకు రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని పలుసూచనలు చేశారు. విద్యార్థులందరూ సమయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకొవాలని , ప్రత్యేక తరగతులకు కచ్చితంగా హాజరు కావాలని, ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని, ప్రణాళిక బద్ధంగా చదివి మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు మంజులత గారు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన మద్దూరి గట్టయ్య ఇటీవల మృతి చెందారు. గట్టయ్య కుమారుడు మద్దూరి ఓదెలు తో పాటు వారి కుటుంబ సభ్యులను శనివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ట్రినిటి విద్యా సంస్థల అధినేత దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతకు ముందు మృతుడు గట్టయ్యే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షులు బుద్దుల తిరుపతి యాదవ్, నాయకులు కొయ్యడ మల్లయ్య యాదవ్, జంగిలి తిరుపతి యాదవ్ లతో పాటు తదితరులు ఉన్నారు.

# తబితా ఆశ్రమంలో ఉన్న పిల్లలె రేపటి మేధావులు

## ఐ.ఎ.ఎస్ , ఐపిఎస్ లుగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తాం

## ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ మద్దెల దినేష్ ఆధ్వర్యంలో ఆశ్రమ పిల్లలకు సామూహిక పుట్టినరోజు వేడుకలు

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :** రామగుండం తబితా ఆశ్రమం లో ఉన్న పిల్లలే రేపటి మేధావులు అని, వారిని ఐఎస్, ఐపిఎస్ లుగా తీర్చి దిద్దడమే ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ లక్ష్యమని, అందుకు తీవ్రంగా కృషి చేస్తామని ఆ సంస్థ అధ్యక్షులు మద్దెల దినేష్ అన్నారు. మద్దెల దినేష్ ఆధ్వర్యంలో శనివారం రామగుండం తబితా ఆశ్రమం లో ఉన్న పిల్లలకు జరిగిన సామూహిక పుట్టినరోజు వేడుకలలో ముందుగా పిల్లలందరికీ కొత్త బట్టలు అందించి పిల్లలు వాటిని ధరించిన అనంతరం భారీ బర్త్ డే కేక్ ను కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు పిల్లలతో కెక్ కట్ చేసిన అనంతరం పలువురు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రామగుండం తబితా ఆశ్రమం లో ఉన్న పిల్లలకు ఫిబ్రవరి 1 న సాముహిక పుట్టిన రోజు వేడుకలు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో జరుపడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ ఆశ్రమం లో ఉన్న పిల్లలు తల్లి తండ్రుల ఆలనా పాలనా లేని వారని, వీరందరికీ తబితా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్, అతని భార్య విమల వారి కుటుంబ సభ్యులు తమ స్వంత పిల్లల లాగా చూసుకుంటూ, పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న వివిధ వర్గాల ప్రజల నుంచి, స్వచ్ఛంద సంఘాల సహాయ సహకారం

తో దన, వస్తు రూపేణా ఈ ఆశ్రమంలో ఉన్న పిల్లలందరినీ పోషించడం తో పాటు విద్యా బోధన చేయించడం మరియు వారికి వైద్య సౌకర్యం కల్పించడం జరుగుతుందని ఆయన పెర్కోన్నారు. మాజి జెడ్పిటిసిలు కందుల సంధ్యరాణి, అయోధ్య సింగ్, స్థానిక మాజి కార్పొరేటర్లు కన్నూరి సతీష్, మంచికట్ల దయాకర్, మాతింగి సునీత, సి.హెచ్ సౌజన్య, గోలివాడ చంద్రకళ, వై. లెనిన్ మడికొండ ఓదెమ్మ గార్ల తోపాటు, హెల్పింగ్ హ్యాండ్స్ శ్యామ్ % టీం ఫోటో గ్రాఫర్ రామస్వామి గార్లు మా వంతు సహాయం తబితా ఆశ్రమ పిల్లలకు నిరంతరం ఉంటుంది అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సి,, ఐసిపిఎస్ అధికారులు, శ్రీధర్ చైర్‌పర్సన్, కమలాకర్ డిసిపిఓ, జితేందర్, మేదరి శ్రీనివాస్ గార్లతో తో పాటు ఎన్టిపిసి దీప్తి మహిళా సంఘం సుచిత్ర మరియు వారి స్నేహితురాలు, ప్రతినిధులు మరియు ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ నిర్వాహకులు స్వచ్ఛందా సంస్థల ఐక్యవేదిక ప్రతినిధులు మరియు వివిధ రాజకియ పార్టీల నాయకులు రేణికుంట్ల నరేంద్ర, మారుపల్లి నవీన్ కుమార్, కందుల పోచన్న, దాసరాపు రాజేంద్ర ప్రసాద్, మొయిద్ సన్నీ, జ్ఞాన్ జాన్, మద్దెల రామస్వామి, మొగరం వెంకటి, రేవల్లి పద్మ ప్రవీణ్, కంది సుజాత నాగరాజు, పద్మ శోభ, ఎం.ఏ గౌస్, తోడుపునూరి రమేష్, సంతోష్, మండల శ్రీనివాస్, గీత రాజ్ అకాడమీ ఛైర్మెన్ బట్టల గీత, పులిపాక రవీందర్, సతీష్, నరేష్, రాజు తో పాటు ఫాస్టర్ గారితో పాటు ఆశ్రమ నిర్వహకులు వీరేందర్ నాయక్ విమల గార్లు పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వహకులకు ఘనంగా అతిధులచే ఘనంగా సత్కరించారు మద్దెల దినేష్ తెలిపారు.

# దేశ ప్రజల దిశా మార్చిన బడ్జెట్!!

## రైతులు సామాన్య ప్రజలకు ఊరట!!

## కేంద్ర బడ్జెట్ అద్భుతం

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** వనపర్తి బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము హర్షం వ్యక్తుడు చేసినారు

2025- - 26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ దేశ ప్రజల దిశ మార్చే విధంగా ఉందని ఈ బడ్జెట్ పేద మధ్యతరగతి సామాన్య ప్రజలకు ముఖ్యంగా రైతులకు మేలు చేస్తుందని బిజెపి వనపర్తి పట్టణ మాజీ అధ్యక్షుడు బచ్చు రాము అన్నారు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ఎనిమిదవ సారి బడ్జెట్ ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు గూడ్ న్యూస్ చెప్పిందని ఈ బడ్జెట్లో కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు

వృద్ధులకు వడ్డీపై టీడీఎస్ లో సడలింపు 36 ఔషధాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ రద్దు బీమా రంగంలో ఎఫ్ డీఐ 100% వరకు పెంచడం వచ్చే వారం ఇన్కమ్ ట్యాక్స్ బిల్లు ప్రవేశపెట్టడం గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా సౌకర్యం కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం. జరిగిందని ఆయన తెలిపారు, కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు గతంలో ఉన్న మూడు లక్షల పరిమితిని ఏకంగా ఐదు లక్షల పెంచడం రైతుల పట్ల బిజెపి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపించడం జరిగిందని ఆయన అన్నారు, అంతేకాక మధ్యతరగతి ప్రజలకు కేంద్రం నిజమైన తీపి కబురు చెప్పిందని 12 లక్షల వరకు తను మినహాయించి నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయం అని అన్నారు, అంతే కాక దేశంలోని ప్రతి జిల్లా కేంద్రాలలో గల ప్రభుత్వ ఆసుపత్రులలో క్యాన్సర్ సెంటర్స్ ను ఏర్పాటు చేసేందుకు ఈ బడ్జెట్ లో నిర్ణయం తీసుకోవడం కూడా పేద ప్రజలకు వైద్య పరంగా ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు, విద్య ,వైద్యం వ్యవసాయ రంగం ,పైన సుష్మ చిన్న తరహా పరిశ్రమలకు 10 లక్షల విలువైన క్రెడిట్ కార్డులను అందించడం ఎస్సీ ఎస్టీ మహిళలకు ఔత్సాహిక పారిశ్రామిక వేతల కింద రెండు కోట్ల రుణాలు మంజూరు చేస్తూ ఈ బడ్జెట్లో గొప్ప నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు, అంతే కదా తపాలా శాఖ అంగన్వాడి కేంద్రాలకు కొత్త హంగులు ప్రభుత్వ పెట్టుబడుల పెంపకం ఎమ్ ఎస్ ఎం ఈ లకు 20 లక్షల కోట్ల రుణాలను ఇవ్వడం తో పాటు రైతులకు వడ్డీ రైతు కింద ఐదు లక్షల విలువ చేసే క్రెడిట్ కార్డులు అందజేయడం మొత్తం 27 కీలక రంగాలకు కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో అధిక ప్రాధాన్యత కల్పించడం మామూలు విషయం కాదని అన్నారు ఎన్నో అంచనాలు మరెన్నో ఆశల నడుమ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఈ సందర్భంగా మున్నూరు రవీందర్ ఆనందాన్ని వ్యక్త చేశారు, మధ్యతరగతి ప్రజానీకానికి భారీ ఊరట కల్పించే విధంగా ఈ బడ్జెట్ రూపు దిద్ది ప్రజల ముందు ఉంచడం దేశ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అద్భుతమైన ఈ బడ్జెట్ ను జీర్ణించుకోలేని టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అసహనం వ్యక్తం చేయడం బాధాకరమని అన్నారు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ రాజకీయ లబ్ధి కోసం అప్పుడు ప్రచారం చేయడం మంచిది కాదని ఆయన అన్నారు, తెలంగాణ రాష్ట్రం ఆరు గ్యారెంటీలను చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఈరోజు ప్రభుత్వాన్ని డిసాల్ చేస్తేఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేరని బచ్చు రాము ఎద్దేవా చేసినాడు ప్రతి ఒక్కరు సహకరించాలని అభినందనలు తెలుపాలని ఆయన సూచించారు,

# కేంద్రం విధానాలతో వ్యవసాయరంగం కుదేలు

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**ఎరువుల సబ్సిడీ గతేడాది బడ్జెట్ లో ఫర్టిలైజర్ రివైజ్డ్ ఎస్టిమేట్ రూ.1,71,299 కోట్లు ఉంటే, ఈ ఏడాది బడ్జెట్ ఎస్టిమేట్ రూ.1,67,887 కోట్లు మాత్రమే ఉంది. ఎరువులపై 3,412 కోట్ల సబ్సిడీని తగ్గించారాని ఇది వ్యవసాయ రంగం, రైతుల మీద తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆహార సబ్సిడీ2023-24 బడ్జెట్ రూ.2,11,814 కోట్లు ఉంటే, గత బడ్జెట్ లో అతి తక్కువగా రూ.2,05,250 కోట్లకు తగ్గించారు. ఇప్పుడు దాన్ని 2,03,420 కోట్లకు తగ్గించారుఅంటే ప్రతి సంవత్సరం ఆహార సబ్సిడీని తగ్గిస్తూ పోవడమే కేంద్రం పనిగా పెట్టుకున్నదిఅని ఇది పేద ప్రజల జీవితాల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది,2025 - 26 బడ్జెట్లో కేంద్రం రాజకీయ అవసరాలనే ఉపయోగించుకున్నది తప్ప దేశ సమ్మిళిత అభివృద్ధి మీద దృష్టి సారించలేదు,ఇలాంటి బడ్జెట్ తో కేంద్రం పదే పదే చెప్పే వికసిత్ భారత్ సాధ్యం అవుతుందా ?దేశమంటే మట్టి కాదోయ్ .. దేశమంటే మనుషులోయ్ అన్న నిర్మలా సీతారామన్ దేశమంటే కొన్ని రాష్ట్రాలు మాత్రమే అన్నట్లు బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరం2024లో పేజీ, 2025 ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారు. 2026 యూపీ, 2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడతారా ?బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేదా ?ఇద్దరు కేంద్రమంత్రులు సహా 8 మంది ఎంపీలు ఉండి ఏం సాధించారు కేంద్ర జీడీపీకి 5.1 శాతం కంట్రిబ్యూషన్ ఇస్తున్న తెలంగాణ మరోసారి మోసపోయిందినిధులు రాబట్టడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది .. 40 వేల కోట్లు కావాలని తూతూ మంత్రం లేఖలు రాసి చేతులు దులుపుకున్నారు ఏడాదిలో 30 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి ఏం సాధించారో తెలంగాణ ప్రజలకు చెప్పాలి8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు మొత్తం 16 మంది 8 రూపాయలు తేలేకపోయారుతెలంగాణ ప్రయోజనాలు కాపాడటంలో కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాన్ని ప్రజలు గమనిస్తున్నారుకేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండిచై చూపడంపై ఒక ప్రకటనలో ఖండించిన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

## స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున పల్లవి స్కూల్



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :** మండలంలోని నంచర్ల గేట్స్ పల్లవి స్కూల్లో ఘనంగా స్వయం పరిపాలన దినో త్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గా ఆపీయా బేగం, డిఈఓ పి కార్తీక్ కుమార్, ప్రిన్సిపాల్ గా టంకరి పావని, మిగతా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాధవి లత మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో స్టేజ్ ఫీవర్ తొలగిపోయి నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణ అలవాడతాయని అలాగే విద్యార్థులు మంచి చదువులు చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబ్ నగర్ జిల్లా ప్రవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ పాఠశాల అధ్యాపక బృందం ఎం. వెంకటేష్, కృష్ణయ్య, బాలమణి, అఖిల సాయి, దీప్తి, సరిత, అశ్విని, జహీద్ బేగం, బీడీ. రాఘవేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పి ఆర్ టి యు రాయికోడ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన రాయికోడ్ లో పి.ఆర్.టి.యు టిఎస్ రాయికోడ్ మండల శాఖ అధ్యక్షులు యాదవులు అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశం లో పాల్గొని ప్రసంగిస్తున్న పి ఆర్ టి యు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య , పి ఆర్ టి యు టి ఎస్ సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు డా. తులసిరామ్ రాథోడ్, రాయి కోడ్ ఎం ఈ ఓ అంజయ్య పాల్గొని ఉపాధ్యాయ సమస్యల గురించి, ఉపాధ్యాయులకు రావలసిన విషయాల గురించి ఆత్మీయ సమ్మేళనం లో చర్చించడం జరిగింది. ఎం ఈ ఓ ఆధ్వర్యంలో ఇటివలే నూతనంగా ఎంపికై వివిధ పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు బి శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల రాయికోడ్ సౌజన్యం తో సర్వీస్ బుక్ లను అందించడం జరిగింది. కార్యక్రమం లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి శ్రీనివాస్, జిహెచ్ఎం నర్సింలు, కె సురేందర్, డి విట్టల్, మంజ్యా నాయక్, అనిల్ కుమార్, పి ఆర్ టి యు టి ఎస్ పుల్కల్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :** పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి, కనగర్తి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ నగరంలో పర్యటించారు. గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి పరిష్కారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ మల్లరెడ్డి మాజీ ఎంపీటీసీ ఏడవెల్లి శంకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, వెలిచలా రాజయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్,మల్లేష్ యాదవ్,గ్రామ శాఖ అధ్యక్షులు చొక్కాన్న, తిరుపతి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల నరేష్, జడల రాజు స్వామి, రాజు, సాయి, పోచలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# జర్నలిస్ట్ కు ఆర్థిక సహాయం

**జర్నలిస్ట్ బందెల రాజశేఖర్ కు పరామర్శ.**

**రూ 10,000 అందించిన అల్లం వినోద్ రెడ్డి.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి ఫిబ్రవరి 1:** ఎవరికి ఏ ఆపద సంభవించిన నేనున్నానంటూ ఎప్పుడు ముందుంటూ తనకు తోచిన సాయం అందిస్తున్న విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకులు అల్లం వినోద్ రెడ్డి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఓ జర్నలిస్టుకు ప్రమాదం జరిగి కాలు కోల్పోయి దీనస్థితిలో ఉన్న ఆయనకు పదివేల రూపాయలు నగదు అందించి నేనున్నాను అంటూ అండగా నిలిచారు.కాల్వ శ్రీరాంపూర్ మండలం చిన్న రాతుపల్లి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్ గత రెండు దశాబ్దాలుగా వివిధ దినపత్రికలో పనిచేస్తున్నారు. గత నెల రోల రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి కాల్ కోల్పోయాడు. విషయం తెలుసుకున్న విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకులు అల్లం వినోద్ రెడ్డి చిన్నరాతిపల్లి గ్రామంలో ఉన్న బందెల రాజశేఖర్ ను శనివారం సాయంత్రం పరామర్శించారు. బందెల రాజశేఖర్ కు 10000 రూపాయలు ఆర్థిక సాయం అందించి తనకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకులు అల్లం వినోద్ రెడ్డి మాట్లాడుతూ బందేల రాజశేఖర్ లాంటి సీనియర్ జర్నలిస్టు ప్రమాదానికి గురై కాలు కోల్పోవడం దురదృష్టకరమైన సంఘటనని విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని భవిష్యత్తులో వైద్య ఖర్చుల కోసం తాను కొంత ఆర్థిక సాయం అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఆయన వెంట జర్నలిస్టు దొమ్మటి రాజేష్, వోడ్నాల అజయ్, గూగులోతు రామచందర్, బందెల శ్రీనివాస్ ఉన్నారు.



# సర్జరీ విజయవంతం

**వైద్య బృందాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**



**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, ఫిబ్రవరి - 01:** క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా జిల్లా మాతా శిశు ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31 సంవత్సరాల వయస్సు గల మహిళా 6 వారాల 2 రోజుల గర్భం ఫల్లోపియన్ ట్యూబ్ లో ఏర్పడి , అది పగిలి తీవ్రమైన రక్త స్రావం కడుపు లో జరుగగా , సదరు పేషెంట్ ఈ రోజు ప్రైవేటు హాస్పిటల్ సంప్రదించగా స్కానింగ్ చేసి, హయ్యర్ సెంటర్ కు రీఫెర్ చేశారు . ఆ మహిళ ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించిన వెంటనే, గవర్నమెంట్ హాస్పిటల్ లో డ్యూటీ లోఉన్న స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య, మత్తు స్పెషలిస్ట్ డాక్టర్.శౌరయ్య, ఆర్.ఎం.ఓ డాక్టర్. రవీందర్ , ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ వంటి సీనియర్ వైద్యుల సమక్షంలో గంట వ్యవధిలో అవసరమైన రక్త పరిక్షలు నిర్వహించి కడుపు లోపల కలెక్ట్ ఐన సుమారుగా ఒక లీటర్ రక్తాన్ని తీసేసి బ్లీడింగ్ పాయింట్ ని కంట్రోల్ చేసి ఆపరేషన్ విజయవంతగా చేయడం జరిగింది. ఇట్టి సర్జరీ వల్ల మహిళా ప్రాణం కాపడగలిగారు.ఈ శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని, ఆసుపత్రి సిబ్బందిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఆసుపత్రి లో మాతా శిశు ఆసుపత్రిలో వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# కార్మిక వ్యతిరేక, కార్పోరేట్ల అనుకూల బడ్జెట్

**సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి:** శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025, 26 వార్షిక బడ్జెట్ కార్పోరేట్లకు అనుకూలంగా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉన్నదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఒక పత్రిక ప్రకటనలో అన్నారు. 50 లక్షల 65 వేల 345 కోట్ల రూపాయలతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర విషయం, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించే ప్రస్తావన, వ్యవసాయ కూలీలకు కనీస వేతన నిర్ణయం, పని రోజుల పెంచడం, పట్టణ ప్రాంతాలకు విస్తరించడం తదితర అంశాలను విస్మరించారు అని అన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు అమ్మడానికి 25 వేల కోట్లు కేటాయిస్తూ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం దుర్మార్గం, విద్యుత్తు, బొగ్గు గనులు తదితర మౌలిక రంగాల్లో సంస్కరణలు చేపడితేనే రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు, విభజన హామీల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ఏవి కేటాయించకపోవడం అన్యాయం అన్నారు. పెరుగుతున్న తీవ్రమైన నిరుద్యోగాన్ని అరికట్టడానికి కొత్త ఉపాధి పెంచడానికి కావలసిన చర్యలు ఏవి ఈ బడ్జెట్లో లేవు, ఈ బడ్జెట్ మూలంగా దేశ అభివృద్ధి, ప్రగతి సాధ్యం కాదు, మరింత ద్రవయోల్బనం పెరగడానికి తద్వారా ధరల పెరుగుదలకు తోడ్పడుతుంది. అందుకని ఈ బడ్జెట్ను సవరించి ఈ దేశ ఉత్పత్తి రంగమైన వ్యవసాయం, పరిశ్రమలో పై ప్రత్యేక కేటాయింపులు చేసి ఆయా శ్రామిక ప్రజల అవసరాలు తీర్చే విధంగా కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

# విద్య కమిషన్ ప్రజా అభిప్రాయ సేకరణ


**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**



**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, ఫిబ్రవరి -01:** ఫిబ్రవరి 4న మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చే రాష్ట్ర నూతన విద్య పాలసీ రూపకల్పన పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర రాష్ట్ర విద్యా పాలసీ రూపకల్పన కోసం విద్యా కమిషన్ కు బాధ్యతలు అప్పగించిందని, ఇందులో భాగంగా తెలంగాణ విద్యా కమిషన్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. మన పెద్దపల్లి జిల్లాలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నందు ఫిబ్రవరి 4న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు తెలంగాణ విద్యా కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ప్రజాభిప్రాయ కార్యక్రమంలో టీచర్లు, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ ప్రొఫెసర్, ఇంజనీరింగ్ కళాశాల పిజి కళాశాలల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు , విద్యా నిపుణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాలను విద్యా కమిషన్ కు తెలియజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు..

# జనవరి నెల ఉత్పత్తిని ప్రకటించిన ఆర్ఎఫ్ సిఎల్ యాజమాన్యం

**ఉత్పత్తికి సహకరించిన కార్మికులకు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సిజిఎం ఉదయ్ రాజహంస**



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో జనవరి 2025 ఉత్పత్తులను యాజమాన్యం ప్రకటించింది. దేశంలో ఎరువుల కొరతను తీర్చేందుకు కేంద్ర ,రాష్ట్ర భాగస్వామ్యంతో రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారాన్ని ప్రారంభించారు.22మార్చి 2021కర్మాగారంలో పూర్తిస్థాయిలో ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్లాంట్లో ఉత్పత్తి అయిన నీమ్ కాంటెంట్ యూరియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక,మహారాష్ట్ర,తమిళనాడు, ఛత్తీస్‌గఢ్,మధ్యప్రదేశ్ రాష్ట్రాలకుసరఫరాచేస్తు న్నామని సీజీఎం ఉదయ్ రాజహంస తెలిపారు. జనవరి2025లో కర్మాగారం 110604.33 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసాము అని. ఇందులో తెలంగాణకు 54555.30 మెట్రిక్ టన్నులు, ఆంధ్ర ప్రదేశ్ కు 30377.25 మెట్రిక్ టన్నులు, కర్ణాటక కు 8734.68 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్ర కు 2623.59 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్ కు 5643.72 మెట్రిక్ టన్నులు, తమిళనాడు కు 8669.79 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసామని.ఈ సందర్భంగా, సంస్థ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని మరియు 110604.33 మెట్రిక్ టన్నులఉత్పత్తినిసాధించటంలో కీలకపాత్ర పోషించిన కార్మికులు,ఉద్యోగులు,అధికారులకు ఆర్ ఎఫ్ సి ఎల్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి అభినందనలు తెలిపారు. అలాగే సంస్థకు మద్దతుగా ఉన్న రాష్ట్ర, జిల్లా యంత్రాంగానికి, కేంద్ర ఎరువులు, రసాయానాలు మంత్రిత్వ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పి ఎస్ సి డబ్ల్యూ యు రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షులుగా ఎస్కే యాకూబ్ షావలి, ప్రధాన కార్యదర్శిగా తోకల రమేష్.**



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** శుక్రవారం రోజున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో కామ్రేడ్ చంద్ర కృష్ణమూర్తి ట్రస్ట్ భవన్లో ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ టి యు సి ఐ రాష్ట్ర రెండవ మహాసభ జరిగింది.ఈ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది సంఘం గౌరవ అధ్యక్షులుగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నరసయ్య, అధ్యక్షులుగా షేక్ యాకూబ్ షావలి (ఇల్లందు), ప్రధాన కార్యదర్శిగా తోకల రమేష్ (గోదావరిఖని),ఉపాధ్యక్షులుగా ఆర్ మధుసూదన్ రెడ్డి (మణుగూరు), సహాయ కార్యదర్శిగా పెద్ద బోయిన సతీష్ (కొత్తగూడెం), కోశాధికారిగా సివై పుల్లయ్య(సత్తుపల్లి) ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాయం వెంకన్న (ఇల్లందు) శరత్ (సత్తుపల్లి) కార్యవర్గ సభ్యులుగా కొయ్యడ శంకర్, సంజీవరెడ్డి, పులిపాక రాజేందర్, మాట్ల సమ్మయ్య, దేవి, జానీ, అశోక్, రాజశేఖర్, మరియా,ఎం చంద్రశేఖర్, శంకర్, కొత్తపల్లిరఘు, సంజీవ్ లతోపాటు మొత్తం 21 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో కొన్ని తీర్మానాలు కూడా చేయడం జరిగింది. వేతనాల పెంపుదలకై సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. సింగరేణిలో ఖాళీగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని, డిమాండ్ చేయడం జరిగింది. గైర్హాజరు పేరుతో విధిస్తున్న పెనాల్టీలను వెంటనే రద్దు చేయాలని, ప్రతి నెల 7వ తారీకు వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, నర్సరీ సులభ్ కోల్డ్ ట్రాన్స్పోర్ట్ లాంటి తదితర సెక్షన్లకు సీఎం పిఎఫ్ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేతనాల పెంపదలకై తదితర సమస్యల పరిష్కారానికి సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది.

# కేయూ నూతన రిజిస్ట్రార్‌కు అభినందనలు



**మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య.**

**అగ్నిధారన్యూస్ హనుమకొండ:** కాకతీయ విశ్వవిద్యాల యం నూతన రిజిస్ట్రార్ గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ వి. రామచంద్రం కు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ అనే మారుమూల ప్రాంతంలో పేద దళిత కుటుంబంలో జన్మించి, చిన్నతనం నుండే ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని ఉన్నత విద్యను అభ్యసించి శనివారం కాకతీయ విశ్వవిద్యాలయం కు రిజిస్ట్రార్ కావడం అభినందనీయమని గుమ్మడి నర్సయ్య అన్నారు.విశ్వవిద్యాలయ అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ.ఐ.యు.కె.ఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్రన్న, రాష్ట్ర నాయకులు జగ్గన్న, కేయూ పరిశోధక విద్యార్థి, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు అలువాల నరేష్, రాష్ట్ర నాయకులు కావ్య, బాలు, అనూష, పృధ్వీరాజ్, వంశీ, సంగీత పవన్ కళ్యాణ్, సంగీత, గణేష్, శ్రీజ, జ్యోతి, సాధన, మానస, సాత్విక, చందన తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్లు ప్రారంభించిన శాసనసభాపతి

**వికారాబాద్ :** వికారాబాద్ మండలం నారాయన్ పూర్ లో రూ. 2.43 కోట్లతో నూతన 33/11కేవి సబ్ స్టేషన్, వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో రూ. 3.13 కోట్ల అంచనా విలువతో నూతన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి అనంతరం రూ. 3.52 కోట్లతో వికారాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన టీజీఎస్పిడిసిఎల్ సంస్థ ఎస్ఈ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డీవో వాసు చంద్ర, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణకు మొండిచెయ్యి : హరీష్ రావు

**సిద్దిపేట :** కేంద్ర బడ్జెట్ పై మాజీ ఆర్థికమంత్రి హరీష్ రావు స్పందించారు.దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కానీ దేశమంటే కొన్ని రాష్ట్రాలు కాదోయ్ దేశమంటే 28 రాష్ట్రాలోయ్ అన్న సంగతి గుర్తుపెట్టుకోవాలి. కేంద్ర బడ్జెట్ తుంగలో తొక్కేలా ఉంది. దేశానికి 5.1 జీడీపీ ఇచ్చి దేశాన్ని తెలంగాణ పోషిస్తుంది. కానీ పోయినసారి ఆంధ్రకు, ఈసారి బీహార్ కి బడ్జెట్ లో పెద్దపీట వేసి తెలంగాణకి మొండిచేయి చూపారు. బడేభాయ్ అని ప్రధాని మోడీని సీఎం రేవంత్ మెచ్చుకుంటున్నారు. కానీ బడేభాయ్ ఈ చోటే భాయ్ ని పట్టించుకోవడం లేదు. ముప్పై సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ 30 రూపాయలు కూడా రాష్ట్రానికి తేలేదు. కాంగ్రెస్ ఎంపీలు 8 మంది, బీజేపీ ఎంపీలు 8 మంది కలిసి రాష్ట్రానికి గుండు సున్నా తెచ్చారు.

# ఎన్నికలకు ముదిరాజులు సిద్ధం కావాలి

**జిల్లా వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి ముదిరాజ్.**




**అగ్నిధారన్యూస్ సైదాపూర్:** మత్స్యకారులు, ముదిరాజులు స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధం కావాలని కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి ముదిరాజ్ అన్నారు, సైదాపూర్ మండల కేంద్రంలో శనివారం రోజున కరీంనగర్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం 2025 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరణ కార్యక్రమాని కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా వారు మాట్లాడారు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముదిరాజులు సిద్ధం కావాలని అన్నారు, ఐదు సంవత్సరాలు పూర్తయిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు,జిల్లా ఉపాధ్యక్షులు రాయిచెట్టి చంద్రయ్య ముదిరాజ్, మాట్లాడుతూ ముదిరాజులకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని, ముదిరాజులను బిసిడి నుంచి బీసీ ఏ కు మార్చాలని రాబోయే ఎన్నికల్లో ముదిరాజులు ఎక్కువగా పోటీ చేయాలని పిలుపునిచ్చారు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోల్ ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యమత్యంతో ముందుకెళ్లాలని, ముదిరాజులు రాజకీయంగా ఎదగాలన్నారు, ఈ కార్యక్రమంలో మండల యువత అధ్యక్షులు నీళ్ల సతీష్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి గుళ్ళ అశోక్ ముదిరాజ్, మండల పిఆర్ఓ గూళ్ల అజయ్ ముదిరాజ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు లంక సిరి రాజు ముదిరాజ్, కొలకని మైసయ్య ముదిరాజ్, నెల్లి సమ్మయ్య ముదిరాజ్, గౌరవేని శ్రీను ముదిరాజ్, గంగాధరి మల్లయ్య ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు నెల్లి సంపత్ ముదిరాజ్ నీర్ల వెంకటరాజ ముదిరాజ్, నెల్లిపోచయ్య ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థి...

**ఈనెల 4వ తేదీన ఇండోర్ లో జరిగే పోటీల్లో పాల్గొననున్న విద్యార్థి**

**అభినందించిన డీఈవో మాధవి, ఎంఈఓ రాజయ్య**



**అగ్నిధారన్యూస్, సుల్తానాబాద్,ఫిబ్రవరి 01** జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన ఐపీఎస్ పాఠశాల విద్యార్థి. ఈనెల 4 తేదీ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ లో నిర్వహించే జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల కు చెందిన విద్యార్థి ఏం సంప్రీత్ ను డీఈవో మాధవి అభినందించారు.ఈ సందర్భంగా డి ఈ ఓ మాధవి జాతీయ క్రీడాకారున్ని అభినందిస్తూ పెద్దపల్లి జిల్లా నుంచి జాతీయస్థాయిలో పాల్గొనడానికి వెళ్తున్న క్రీడాకారుడు మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈఓ రాజయ్య, పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్ విద్యార్థి ఏం సంప్రీత్ ను కోచ్ సత్యనారాయణ ను అభినందించారు.



# ఆ స్టార్ హీరోకు కూతురిగా, ప్రేయసిగా నటించిన కీర్తి సురేష్

సినీరంగంలో హీరోయిన్ కీర్తి సురేష్ కు మంచి క్రేజ్ ఉందన్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. తెలుగులో మహానటి సినిమాతు ఉత్తమ నటిగా ఏకంగా జాతీయ అవార్డ్ అందుకుంది. ఇటీవలే బేబీ జాన్ సినిమాతో హిందీ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. కీర్తి సురేష్ తల్లిదండ్రులు ఇద్దరూ సినీరంగానికి చెందినవారే. ఆమె తండ్రి ప్రముఖ నిర్మాత కాగా.. తల్లి ఒకప్పటి నటి. బాలనటిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కీర్తి.. మలయాళంలో మూడు సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించింది. ఆ తర్వాత గీతాంజలి సినిమాతో హీరోయిన్ గా మారింది. తెలుగులో రామ్ పోతినేని సరసన నేను శైలజ సినిమాతో హీరోయిన్ గా పరిచయమైంది. ఆ తర్వాత టాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమెకు ఆఫర్స్ క్యూ కట్టాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం టాప్ హీరోయిన్ గా దూసుకుపోతున్న కీర్తి.. చిన్నప్పుడు ఓ స్టార్ హీరోకు కూతురిగా నటించింది.ఆ తర్వాత కొన్నాళ్లకు అతడికే ప్రేయసిగా కనిపించింది. అగ్ర కథానాయికగా బిజీగా ఉన్న సమయంలో ఆ స్టార్ హీరో పిలిచి మరీ తనను అంకుల్ అని పిలవద్దని చెప్పారట. ఇంతకీ ఆ హీరో ఎవరో తెలుసా.. అతడే మలయాళీ నటుడు దిలీప్. 2002లో దిలీప్ హీరోగా నటించిన చిత్రం కుబేరన్. ఇందులో అతడు ముగ్గురు పిల్లల్ని దత్తత తీసుకుంటాడు. అందులో ఒకరు కీర్తి సురేష్. ఆ తర్వాత కొన్నాళ్లకు 2014లో వచ్చిన రింగ్ మాస్టర్ సినిమాలో దిలీప్ ప్రేయసిగా నటించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. దిలీప్ సరసన హీరోయిన్ గా నటించేందుకు ఎక్కువగా ఆలోచించలేదని.. చిన్నప్పటి నుంచి అతడిని చూస్తూనే ఉన్నానని.. అతడేమి మారలేదని.. ఇప్పటికీ అలాగే ఉన్నాడని తెలిపింది. రింగ్ మాస్టర్ మూవీలో తనే తన గర్ల్ ఫ్రెండ్ అని తెలియగానే పిలిచి మరీ ఓ మాట చెప్పారట. చిన్నప్పుడు అంకుల్ అని పిలిచేదానివి.. ఇప్పుడు అలా పిలవద్దు.. కావాలంటే చేట్ట (అన్నయ్య) అని పిలవమని చెప్పారట. దీంతో సరే చేట్ట అని పిలిచినట్లు గుర్తు చేసుకుంది.



# 59 ఏళ్ల వయసులో మూడో పెళ్లికి సిద్ధమైన స్టార్ హీరో?

బాలీవుడ్ స్టార్ నటుడు ఆమీర్ ఖాన్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న లీడింగ్ యాక్టర్లలో టాప్‌లో ఉంటారు. ఆయన్ని ముద్దుగా మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అని కూడా పిలుస్తుంటారు. లగాన్, గజినీ, పీకే, దంగల్‌తోపాటు ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్ అందించి సక్సెస్ రేంజ్‌లో ఉన్న ఈ స్టార్ పర్సనల్ లైఫ్‌లో మాత్రం అంత హ్యాపీగా లేడనే చెప్పాలి. ఇప్పటికే ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమీర్ వయసు 59 ఏళ్లు. ఈ క్రమంలోనే ఆమీర్ ముచ్చటగా మూడో పెళ్లిక సిద్ధమైనట్లు తెలిసింది. బెంగళూరుకు చెందిన ఓ మహిళతో ఆమీర్ ఖాన్ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నట్లు సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. ఆమెను ఇటీవలే తన కుటుంబ సభ్యులకు కూడా పరిచయం చేసినట్లు టాక్. వీరి పెళ్లికి కుటుంబ సభ్యులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అన్నీ కుదిరితే అతి త్వరలోనే ఆమీర్ మూడోసారి పెళ్లి పీటలు ఎక్కనున్నట్లు నటుడి దగ్గరి వ్యక్తి ఒకరు చెప్పినట్లు జాతీయ మీడియాలో కూడా వరుస కథనాలు వస్తున్నాయి. 'ఆమీర్ బెంగళూరుకు చెందిన ఓ మహిళతో డేటింగ్‌లో ఉన్నారు. వారి గోప్యతను గౌరవించి వ్యక్తిగత వివరాలు వెల్లడించలేను. ఆమెను ఆమీర్ తన కుటుంబ సభ్యులందరికీ పరిచయం చేశాడు. ఆ మీటింగ్ చాలా బాగా జరిగింది' అంటూ సరదు వ్యక్తి చెప్పినట్లు మీడియా పేర్కొంది. కాగా, ఆమీర్ ఖాన్‌కు ఇప్పటికే రెండు వివాహాలైన విషయం తెలిసిందే. 1986లో రీనా దత్తాను ఆమీర్ పెళ్లి చేసుకున్నారు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఐరా ఖాన్, జునైద్ ఖాన్ ఉన్నారు. ఐరాకు ఇటీవలే పెళ్లైంది కూడా. ఇక రీనా దత్తా %-% ఆమీర్ జంట 2002లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2005లో చిత్ర నిర్మాత అయిన కిరణ్‌రావును వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఆజాద్ ఉన్నాడు. ఆ పిల్లాడు సరోసగీ ద్వారా జన్మించాడు. అయితే, కిరణ్ రావుతో కూడా ఆమీర్ విడాకులు తీసుకున్నాడు. 15 ఏళ్ల వివాహ బంధానికి 2021లో ముగింపు పలికారు. ఈ క్రమంలోనే మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ 59 ఏళ్ల వయసులో ముచ్చటగా మూడో పెళ్లికి సిద్ధమైనట్లు టాక్ వినిపిస్తోంది.

# ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకి వెళ్లేది అప్పుడే.!



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్న విషయం తెలిసిందే. గత ఏడాది దేవర సినిమాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్నాడు తారక్. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా వరల్డ్ వైడ్‌గా రూ.500 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా అనంతరం కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ తో తారక్ సినిమా చేయబోతున్నాడు. ఎన్టీఆర్‌నీల్‌గా రానున్న ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ చేస్తుందా ఎప్పుడు అప్‌డేట్‌లు వస్తాయా అని అభిమానులతో పాటు ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్ ఈ నెలలోనే పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తుంది. ఫిబ్రవరి రెండో వారం లేదా మూడో వారంలో షూటింగ్ మొదలు కాబోతున్నట్లు సమాచారం. ఈ మేజర్ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు పలువురు అగ్ర తారాలు షూటింగ్‌లో పాల్గోనబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం తారక్ వార్ 2 సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఈ షూటింగ్ అనంతరం నీల్ ప్రాజెక్ట్ మీదా ఫోకస్ చేయనున్నాడు తారక్.

# అర్జున్ కపూర్ 'మేరే హస్బెండ్‌కి బీవీ' ట్రైలర్ రిలీజ్

బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మేరే హస్బెండ్‌కి బీవీ' రకుల్‌ప్రీత్ సింగ్ భూమి పెడ్నేకర్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాను రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ నిర్మిస్తున్నాడు. ఫిబ్రవరి 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. యూట్యూబ్‌లో అలరిస్తున్న ఈ ట్రైలర్‌ను మీరు చూసేయండి.



# 'తంగలాన్'కి అరుదైన అవకాశం

### అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్లో విక్రమ్ మూవీ

తమిళ స్టార్ నటుడు విక్రమ్, పా. రంజిత్ కాంబోలో వచ్చిన చిత్రం తంగలాన్ కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వచ్చిన ఈ చిత్రం గత ఏడాది ఇండిపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకుంది. చాలా రోజుల తర్వాత విక్రమ్ హిట్ దక్కడమే కాకుండా.. బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ చిత్రం అరుదైన ఘనతను సాధించింది. తంగలాన్ చిత్రం తాజాగా అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితం కాబోతుంది. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న రాటర్‌డామ్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్లో ఈ సినిమా డైరెక్టర్ కట్ ప్రదర్శితం కాబోతున్నట్లు దర్శకుడు పా.రంజిత్ ఎక్స్ వేదికగా ప్రకటించాడు.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com